www.prajanaava.in

Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 8 | వెల రూ.5.00

Published from: Hyderabad, Karimnagar, Circulated to : Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

కరీంనగర్ | సంపుటి : 03 | సంచిక : 274 | శుక్రవారం | 29 మే, 2026

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
: 99484 33277 / 7288825681

## ప్రతీ పౌరుడికి యూఐఎన్

- రాష్ట్రంలో 'యూనిఫైడ్ వెల్ఫేర్ కార్డ్'
- ప్రతి పౌరుడికి ప్రత్యేక గుర్తింపు సంఖ్య
- అన్ని సంక్షేమ పథకాల లబ్ధి ఒకే కార్డులో లభ్యమయ్యేలా విప్లవాత్మక నిర్ణయం

2



## ఇందిరమ్మ స్ఫూర్తి.. ఎన్టీఆర్ ఆదర్శాలతో

# ప్రజాపాలన

## తెలంగాణను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తాం



- 30 వేల ఎకరాల్లో 'ఇండియా ఫ్యూచర్ సిటీ'
- ఎన్టీఆర్ రూ.2 కే కిలో బియ్యం స్ఫూర్తితోనే రాష్ట్రంలో సన్నబియ్యం పంపిణీ
- స్థానిక సంస్థల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ల కోసం పార్లమెంట్‌లో మద్దతిస్తాం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- అమీర్‌పేటలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

రాష్ట్రంలోని ప్రతి పౌరుడు పొందుతున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలన్నింటినీ ఒకే వేదికపైకి తీసుకురావడానికి 'సమగ్ర సంక్షేమ కార్డు' (యూనిఫైడ్ వెల్ఫేర్ కార్డు) రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ కార్డు ద్వారా ప్రతి వ్యక్తి ఏ శాఖ ద్వారా, ఏ పథకం కింద, ఎంత మేరకు లబ్ధి పొందుతున్నారో స్పష్టంగా తెలుసుకునే విధంగా వ్యవస్థను రూపొందించాలని సూచించారు. ఈ అంశంపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి బి. అజిత్ రెడ్డి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి తదితర ఉన్నతాధికారులతో సీఎం ప్రత్యేకంగా చర్చించారు. అన్ని శాఖల నుంచి లబ్ధిదారుల వివరాలను సేకరించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

.. వివరాలు 2లో

## హర్మ్యూజ్ జలసంధి ఎవరి సొత్తు కాదు

### చర్చలు విఫలమైతే వెనక్కి తగ్గబోం: ట్రంప్

ఇరాన్ అణ్వాయుధాలపై అమెరికా కఠిన హెచ్చరికలు



2

## చల్లని కబురు

### రెండురోజుల్లో రుతుపవనాల ఆగమనం



తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ ఓ చల్లని కబురు అందించింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతూ రెండు రోజుల్లో రాష్ట్రంలోకి ప్రవేశించనున్నాయని వెల్లడించింది.

2 లో



## పశ్చిమాసియాలో సడలని ఉద్రిక్తతలు

అమెరికా దాడులకు ప్రతీకార దాడులు

.. వివరాలు 4లో



## పరస్పర సహకారంతో జల వివాదాల పరిష్కారం

కెన్-బెట్వా నదుల అనుసంధాన ప్రాజెక్టుపై మోడీ

.. వివరాలు 4లో

### పిడుగుపాటుకు రైతుగా మారిన టెకీ హఠాన్మరణం

.. వివరాలు 4లో

## అర్ధరాత్రి పోలీస్ కార్యాలయం ముందే

# దారుణం

### యువతిపై ఐదుగురు నేపాలీల దాడి

- చేయి పట్టి లాగుతూ అసభ్య ప్రవర్తన
- ధైర్యంగా కేకలు వేసిన బాధితురాలు
- నిందితులను పట్టుకున్న స్థానికులు
- నడిరోడ్డుపైనే దేహశుద్ధి
- అబిడ్స్ పోలీసులకు అప్పగింత
- నిందితులంతా ఫాస్ట్ ఫుడ్ సెంటర్ కార్మికులు
- సీసీఎస్ ఆఫీస్ ముందే ఘటన జరగడంపై నగరంలో తీవ్ర కలకలం




.. వివరాలు 2లో



## భారత అంతరిక్ష రంగంలో సరికొత్త చరిత్ర

- స్వదేశీ పునర్వినియోగ రాకెట్ ఇంజిన్ పరీక్ష విజయవంతం!
- హైదరాబాద్‌కు చెందిన 'అబ్యోమ్ స్పేస్‌టెక్' స్టార్టప్ అరుదైన రికార్డు
- మళ్లీ మళ్లీ వాడుకునేలా పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ఇంజిన్ రూపకల్పన

భారత అంతరిక్ష పరిశోధన రంగంలో హైదరాబాద్ మరోసారి సత్తా చాటింది. నగరానికి చెందిన అబ్యోమ్ స్పేస్ టెక్ అండ్ డిఫెన్స్ స్టార్టప్, దేశంలోనే తొలి పూర్తి స్థాయి స్వదేశీ పునర్వినియోగ లిక్విడ్ రాకెట్ ఇంజిన్ క్వాలిఫికేషన్ టెస్ట్ క్యాంపెయిన్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. మే 27 బుధవారం నాడు మేడ్చల్- మల్కాజ్గిరి జిల్లాలోని శామీ-ర్‌పేటలో ఉన్న కంపెనీకి చెందిన కమర్షియల్ టెస్ట్ ఫెసిలిటీ వద్ద ఈ పరీక్షలు జరిగాయి.

మిగతా 2 లో

## ఇందిరమ్మ ఇళ్ల సవాల్‌కు కట్టుబడండి

- డబ్బా ఇళ్లు కాదు.. డబుల్ ఇళ్లు కట్టిన ఘనత మాది
- పొంగులేటి సవాల్‌పై కేటీఆర్ ప్రతి సవాల్
- 20 లక్షల ఇళ్లు ఇచ్చాకే ఓట్లు అడుగుతామన్న మంత్రికి మాట నిలబెట్టుకునే దమ్ముందా?

3



## సబ్బండ వర్గాల గతి మార్చేలా ప్రణాళిక

3

తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత





# చల్లని కబురు

## రెండు రోజుల్లో రుతుపవనాల ఆగమనం

**ప్రజానావ, హైదరాబాద్:** తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడిపోతున్న తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ ఓ చల్లని కబురు అందించింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతూ రెండు రోజుల్లో రాష్ట్రంలోకి ప్రవేశించనున్నాయని వెల్లడించింది. ఈ రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం ఒక్కసారిగా చల్లబడటమే కాకుండా, రాగల మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రుతుపవనాలు రాష్ట్రవ్యాప్తంగా పూర్తిగా విస్తరించడానికి ముందు రాబోయే రెండు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో వడగాలుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని, పగటిపూట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మరింత ఎక్కువయ్యే ప్రమాదం ఉందని పేర్కొంది. అందువల్ల రుతుపవనాలు పూర్తిగా ప్రవేశించే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎండ తీవ్రత దృష్ట్యా మధ్యాహ్నం వేళల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

# హర్మూజ్ జలసంధి ఎవరి సొత్తు కాదు

## చర్చలు విఫలమైతే వెనక్కి తగ్గబోం: ట్రంప్

## ఇరాన్ అణ్వాయుధాలపై అమెరికా కఠిన హెచ్చరికలు

**మాస్కో:** ఇరాన్‌తో శాంతి చర్చలు కొనసాగుతున్నాయని చెబుతూనే అమెరికా మరోవైపు సైనిక చర్యలను ముమ్మరం చేసింది. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ హర్మూజ్ జలసంధి సమీపంలోని ఇరాన్ సైనిక స్థావరాలపై అమెరికా వైమానిక దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో పలు ఇరాన్ డ్రోన్లను కూల్చివేసినట్లు అమెరికా రక్షణశాఖ వెల్లడించింది. హర్మూజ్ ప్రాంతంలో అమెరికా బలగాలకు ముప్పు పెరుగుతోందని, అందుకే ముందస్తు చర్యగా దాడులు చేపట్టామని అధికారులు పేర్కొన్నారు. ఇక ఇరాన్‌తో జరుగుతున్న చర్చలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. చర్చలు విఫలమైతే తాము వెనక్కి తగ్గబోమని, అవసరమైతే రక్షణ మంత్రిని రంగంలోకి దించి పని పూర్తిచేస్తామని హెచ్చరించారు. అమెరికాలో మధ్యంతర ఎన్నికలు ఉన్నాయని ఇరాన్ భావిస్తోందని, అయితే తాను ఎన్నికలను పట్టించుకోనని ట్రంప్ స్పష్టం చేశారు. “ఇరాన్ అణ్వాయుధాలు సంపాదించకూడదు. అది కేవలం అమెరికా కోసమే కాదు.. ప్రపంచ భద్రత కోసం చేస్తున్న ప్రయత్నం” అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇరాన్ నాయకత్వం అమెరికాతో ఒప్పందం చేసుకోవాలని కోరుకుంటోందని, ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించలేదన్నారు. “ఇప్పటివరకు సంతృప్తిగా లేం.. కానీ చివరికి అవుతాం” అని వ్యాఖ్యానించారు.

### హర్మూజ్‌పై కీలక వ్యాఖ్యలు

హర్మూజ్ జలసంధి అంతర్జాతీయ జలమార్గమని, దానిని ఏ దేశం స్వంతంగా నియంత్రించలేదని ట్రంప్ పేర్కొన్నారు. “హర్మూజ్ అందరికీ తెరిచి ఉంటుంది. మేము పర్యవేక్షిస్తాం కానీ దానిపై ఎవరికీ పూర్తి నియంత్రణ ఉండదు” అని తెలిపారు. ఇదే అంశం ప్రస్తుతం జరుగుతున్న చర్చల్లో కీలక భాగమని వెల్లడించారు. ఒమన్‌కు కూడా ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు. హర్మూజ్ చర్చల్లో ఒమన్ జోక్యం చేసుకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. “ప్రపంచంలోని ఇతర దేశాల్లాగే ఒమన్ కూడా ప్రవర్తించాలి. లేకపోతే చర్యలు తీసుకోవాల్సి వస్తుంది” అని ఘాటుగా స్పందించారు.

### తాత్కాలిక ఒప్పందం కథనాలు.. ఖండించిన వైట్ హౌస్

అమెరికా–ఇరాన్ మధ్య తాత్కాలిక అవగాహన ఒప్పందం కుదిరిందని ఇరాన్ ప్రభుత్వ మీడియా సంచలన కథనాలు ప్రసారం చేసింది. యుద్ధ పరిస్థితులను తగ్గించే దిశగా రెండు దేశాలు ముందడుగు వేసాయని పేర్కొంది. ఈ ఒప్పందం ప్రకారం అమెరికా గల్ఫ్ ప్రాంతం నుంచి సైనిక బలగాలను వెనక్కి తీసుకోవాలని, హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకల రాకపోకలు 30 రోజుల్లో సాధారణ స్థితికి చేరుకుంటాయని వెల్లడించింది. హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకల పర్యవేక్షణను ఇరాన్, ఒమన్ సమన్వయంతో నిర్వహిస్తాయని కథనాలు పేర్కొన్నాయి. అయితే ఈ వార్తలను అమెరికా వైట్ హౌస్ పూర్తిగా ఖండించింది. “ఇరాన్ ప్రభుత్వ నియంత్రణలోని మీడియా ప్రచారం చేస్తున్న కథనాలు అబద్ధాలు. అవగాహన ఒప్పంద ప్రచారం కల్పితం” అని వైట్‌హౌస్ స్పష్టం చేసింది.

### దౌత్య మార్గానికే ప్రాధాన్యం: రూబియో

అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా ఈ అంశంపై స్పందించారు. అమెరికా ఇప్పటికీ దౌత్య చర్చలకే ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. “దౌత్య చర్చలే ఎప్పుడూ మొదటి ఎంపిక. ఒప్పందం కుదిరే అవకాశం ఉంటే మేము సిద్ధంగా ఉన్నాం” అని తెలిపారు. ఇటీవల జరిగిన చర్చల్లో కొంత పురోగతి కనిపించిందని, రాబోయే రోజుల్లో పరిస్థితి మరింత స్పష్టమవుతుందని పేర్కొన్నారు. అయితే చర్చలు విఫలమైతే అమెరికాకు ఇతర ప్రత్యామ్నాయాలు కూడా ఉన్నాయని రూబియో హెచ్చరించారు. అమెరికా భద్రతా ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. అయినప్పటికీ యుద్ధం కంటే చర్చల ద్వారానే పరిష్కారం కోరుకుంటున్నామని తెలిపారు.

### ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం

ప్రస్తుతం హర్మూజ్ జలసంధి ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు అత్యంత కీలక మార్గంగా ఉంది. పర్షియన్ గల్ఫ్ నుంచి ప్రపంచ దేశాలకు వెళ్లే భారీ స్థాయి ముడి చమురు, సహజ వాయువు రవాణా ఈ మార్గం ద్వారానే జరుగుతోంది. దీంతో ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరిగితే అంతర్జాతీయ చమురు ధరలపై తక్షణ ప్రభావం పడే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. ఇరాన్–అమెరికా మధ్య కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు పశ్చిమాసియాలో మరింత అస్థిరతకు దారితీసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకవైపు చర్చలు, మరోవైపు సైనిక హెచ్చరికలు కొనసాగుతుండటంతో ప్రపంచ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# ఇందిరమ్మ స్ఫూర్తి, ఎన్టీఆర్ ఆదర్శాలతో ప్రజాపాలన

- తెలంగాణను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తాం
- 30 వేల ఎకరాల్లో ‘ఇండియా ఫ్యూచర్ సిటీ’
- ఎన్టీఆర్ రూ.2 కే కిలో బియ్యం స్ఫూర్తితోనే రాష్ట్రంలో సన్నబియ్యం పంపిణీ
- స్థానిక సంస్థల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ల కోసం పార్లమెంట్‌లో మద్దతిస్తాం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- అమీర్‌పేటలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ



**ప్రజానావ, హైదరాబాద్:** ఉక్కుమహిళ ఇందిరాగాంధీ, తెలుగు జాతి గర్వకారణం నందమూరి తారకరామారావు స్ఫూర్తితో రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో ప్రజాప్రభుత్వం పనిచేస్తోందన్నారు. హైదరాబాద్ అమీర్‌పేట మైత్రివనం చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు విగ్రహాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజహరుద్దీన్ తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. దేశ చరిత్రను చదివి స్ఫూర్తి పొందాలనుకునే ప్రతి ఒక్కరూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ఇందిరాగాంధీ, ఎన్టీఆర్ వంటి మహానేతలను స్మరించుకోవాలని అన్నారు. దేశం ఉన్నంత కాలం వారి కీర్తి చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. కుల, మత, భాషలకు అతీతంగా నైతికత, నిజాయితీ, నిబద్ధతతో ప్రజల కోసం పనిచేసిన నాయకుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలిచేలా ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జీవితాంతం గుర్తుండిపోయే మధుర ఘట్టమని అన్నారు. తెలంగాణకు చెందిన అనేక మంది నాయకులకు రాజకీయ భిక్ష పెట్టిన నేత ఎన్టీఆర్ అని గుర్తు చేశారు.

### హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దుతాం

రాష్ట్ర అభివృద్ధి దిశగా అనేక ప్రాజెక్టులు అమలు చేస్తున్నామని సీఎం తెలిపారు. హైదరాబాద్‌ను భవిష్యత్‌లో అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. 30 వేల ఎకరాల్లో ప్రతిష్టాత్మక ‘ఇండియా ఫ్యూచర్ సిటీ’ నిర్మాణం చేపట్టడమే కాకుండా ప్రపంచ దిగ్గజ కంపెనీలను తెలంగాణకు తీసుకురానున్నామని వెల్లడించారు. తెలంగాణ యువతను ఉద్యోగులుగానే కాకుండా భారీ సంస్థల యజమానులుగా తీర్చిదిద్దే దిశగా ప్రణాళికలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

### ఎన్టీఆర్ సంక్షేమ పథకాలే స్ఫూర్తి

రాష్ట్రంలో 3.24 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని సీఎం తెలిపారు. ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన రూ.2 కిలో బియ్యం పథకం స్ఫూర్తితోనే ఈ కార్యక్రమం కొనసాగుతోందన్నారు. ఎన్టీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాల స్ఫూర్తితోనే పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు. జనతా వస్త్రాల పథకం స్ఫూర్తితో మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ చేపడుతున్నామని వివరించారు. ఇందిరమ్మ ఆశయాలు, ఎన్టీఆర్ ఆదర్శాలు ప్రజాపాలనలో ప్రతిబింబిస్తున్నాయని సీఎం అన్నారు. ఇందిరమ్మ ఎంత ముఖ్యమో.. ఎన్టీఆర్ కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు.

ఈ ఇద్దరు మహానేతల స్ఫూర్తితోనే ప్రభుత్వం ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తోందన్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయడంలో ఎన్టీఆర్ పాత్రను గుర్తు చేసిన సీఎం.. అదే స్ఫూర్తితో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌కు అందరూ మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రజల సహకారంతోనే ప్రజాపాలన ముందుకు సాగుతోందని, భవిష్యత్‌లో కూడా అదే విధంగా ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, వేమ్ నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ, ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్, ఎన్టీఆర్ కుమారులు నందమూరి రామకృష్ణ, మోహనకృష్ణ కుటుంబ సభ్యులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతీ పౌరుడికి యూఐఎన్

- ప్రతి పౌరుడికి ప్రత్యేక గుర్తింపు సంఖ్య
- అన్ని సంక్షేమ పథకాల లబ్ధి ఒకే కార్డులో లభ్యమయ్యేలా విప్లవాత్మక నిర్ణయం
- లబ్ధిదారుల డేటా సేకరణకు తక్షణమే ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని అధికారులకు ఆదేశం
- ఏఐ ఆధారిత ప్రొఫైలింగ్.. పారదర్శకత పెంచడమే ఏకైక లక్ష్యం
- ఆరోగ్యశ్రీ, ఫీజు రీయంబర్స్ మెంట్, పెన్షన్లు, సర్వే వివరాలన్నీ ఒకే చోట అనుసంధానం
- వలసలపై కేరళ విధానాల అధ్యయనం..
- అనధికార ఏజెంట్లకు చెక్ పెట్టేలా చర్యలు
- ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి



**ప్రజానావ, హైదరాబాద్:** రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి అందుతున్న అన్ని సంక్షేమ పథకాల వివరాలను ఒకే గొడుగు కిందికి తెస్తూ ‘సమగ్ర సంక్షేమ కార్డు (యూనిఫైడ్ వెల్ఫేర్ కార్డ్)’ రూపొందించాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏ పౌరుడికి ఏ శాఖ ద్వారా, ఏ పథకం కింద ఎంత లబ్ధి చేకూరుతుందో ఈ కార్డు ద్వారా స్పష్టంగా తెలిసేలా ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుపై ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె. రామకృష్ణారావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి బి. అజిత్ రెడ్డి, ఐటీ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి తదితర ఉన్నతాధికారులతో కలిసి ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. సమగ్ర సంక్షేమ కార్డు ద్వారా ప్రతి పౌరుడి సంక్షేమ ప్రొఫైల్ ఒకే చోట అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఈ సమాచారాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతతో విశ్లేషించడం ద్వారా పథకాల అమలులో పారదర్శకత పెరుగుతుందని, తద్వారా నిజమైన అర్హులకు ఖచ్చితంగా న్యాయం జరుగుతూనే, అనర్హులను సులభంగా గుర్తించవచ్చని అభిప్రాయపడ్డారు. వేర్వేరు పథకాలకు వేర్వేరు కార్డులు ఇచ్చే పాత పద్ధతికి స్వస్తి పలికి, ఐటీ శాఖ పర్యవేక్షణలో ఈ ఒకే ఒక సమగ్ర కార్డును తీసుకురావాలని సూచించారు. ఈ ప్రక్రియ కోసం సాంకేతిక పరిజ్ఞానంపై పట్టున్న, క్రియాశీలక యువ అధికారులను వినియోగించుకోవాలని చెప్పారు.

### రాష్ట్ర స్థాయి వినూత్న గుర్తింపు సంఖ్య:

ఈ స్మార్ట్ కార్డులో ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్), ఫీజు రీయంబర్స్ మెంట్, కార్మిక శాఖ, విద్యా శాఖ పరిధిలోని పథకాలతో పాటు ప్రభుత్వం అందించే అన్ని రకాల బీమా పథకాల వివరాలను పొందుపరచాలని సీఎం ఆదేశించారు. అవసరమైతే జాతీయ స్థాయిలో ఉన్న ఆధార్ నంబర్ తరహాలోనే, రాష్ట్ర స్థాయిలో ఒక ప్రత్యేక వినూత్న గుర్తింపు సంఖ్యను (ఖఅఐనబవ ×సవత్‌ఈఎ చీబఎఎవతీ) కేటాయించే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఇటీవల ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే వివరాలను కూడా ఈ కార్డుకు అనుసంధానం చేయాలన్నారు. సంక్షేమ లబ్ధిదారులతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వివరాలను సేకరించాలని ఐటీ శాఖను ఆదేశించారు.

### ఏఐ ఆధారిత ప్రొఫైలింగ్ - తక్షణ అప్‌డేట్:

ఈ విధానంలో ఏఐ ఆధారిత ప్రొఫైలింగ్‌ను సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. దీని ప్రకారం, రాష్ట్రంలో ఎక్కడైనా ఒక పౌరుడి మరణ ధృవీకరణ పత్రం (డెత్ సర్టిఫికేట్) జారీ కాగానే, ఆ సమాచారం తక్షణమే పెన్షన్ డేటాబేస్‌కు చేరిపోవాలని, దానికి అనుగుణంగా తదుపరి చర్యలు వెంటనే జరగాలని స్పష్టం చేశారు. అలాగే ప్రజల హెల్త్ ప్రొఫైల్‌ను కూడా ఈ సమగ్ర కార్డుతో లింక్ చేయాలని ఆదేశించారు.

### గల్ఫ్ వలసదారులకు భరోసా:


ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వలస వెళ్లే కార్మికుల రక్షణ కోసం కేరళ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. నైపుణ్యాభివృద్ధి, శిక్షణ కార్యక్రమాలతో పాటు పాస్‌పోర్ట్, వీసా జారీకి సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఒకే చోట అందుబాటులోకి తెస్తే, అమాయక కార్మికులను మోసం చేసే అనధికార ఏజెంట్ల ప్రమేయాన్ని పూర్తిగా అరికట్టవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేసే ప్రతి సంక్షేమ పథకం సమాజంపై ఎలాంటి ప్రభావం చూపుతుందో అంచనా వేయడానికి ఈ సమగ్ర సంక్షేమ కార్డు ఒక దిక్సూచిలా పనిచేస్తుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# భారత అంతరిక్ష రంగంలో సరికొత్త చరిత్ర

## పునర్వియోగ లిక్విడ్ రాకెట్ ఇంజిన్ పరీక్షను విజయవంతం

## అబ్యోమ్ స్పేస్‌టెక్, స్వదేశీ పరిజ్ఞానంతో రూపకల్పన


**ప్రజానావ, హైదరాబాద్:** భారత అంతరిక్ష పరిశోధన రంగంలో హైదరాబాద్ మరోసారి సత్తా చాటింది. నగరానికి చెందిన అబ్యోమ్ స్పేస్ టెక్ అండ్ డిఫెన్స్ స్టార్టప్, దేశంలోనే తొలి పూర్తి స్థాయి స్వదేశీ పునర్వినియోగ లిక్విడ్ రాకెట్ ఇంజిన్ క్వాలిఫికేషన్ టెస్ట్ క్యాంపెయిన్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. మే 27 బుధవారం నాడు మేడ్చల్– మల్కాజ్గిరి జిల్లాలోని శామీర్‌పేటలో ఉన్న కంపెనీకి చెందిన కమర్షియల్ టెస్ట్ ఫెసిలిటీ వద్ద ఈ పరీక్షలు జరిగాయి. సాధారణంగా రాకెట్ ఇంజిన్లను ఒకసారి వాడిన తర్వాత అవి పనికిరాకుండా పోతాయి. కానీ, అబ్యోమ్ స్పేస్ టెక్ అభివృద్ధి చేసిన ఈ ఇంజిన్ మళ్లీ మళ్లీ వాడుకోవడానికి వీలుగా రూపొందించారు. ఈ స్టార్టప్ తన సొంత సాంకేతికతతో, ఎవరి సాయం లేకుండా ఫ్లైట్ రెడీ క్రయోజెనిక్ ఇంజిన్, హోప్ వీటీవీఎల్ పునర్వినియోగ రాకెట్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఈ మైలురాయిని అధిగమించింది. పునర్వినియోగ రాకెట్ల వల్ల అంతరిక్ష ప్రయోగాల వ్యయం భారీగా తగ్గుతుంది. ఇంజిన్ సిస్టమ్స్, కంట్రోల్ ఆర్కిటెక్చర్, డేటా సేకరణ వ్యవస్థలు ఇలా అన్నీ మన దేశంలోనే, అబ్యోమ్ శాస్త్రవేత్తల చేతుల్లోనే రూపొందాయి. విదేశీ సాంకేతికతపై ఆధారపడాల్సిన అవసరం తప్పింది. ఇది కేవలం పౌర అవసరాలకే కాకుండా రక్షణ రంగంలో కూడా వ్యూహాత్మక ప్రయోజనాలను అందిస్తుంది. బిట్స్ పిలాని హైదరాబాద్ క్యాంపస్‌లోని టెక్నాలజీ బిజినెస్



ఇంక్యుబేటర్‌లో ఈ స్టార్టప్ రూపుదిద్దుకుంది. కంపెనీ వ్యవస్థాపకుడు, సీఈవో జైనల్ అబిదీన్ తెలిపిన వివరాల ప్రకారం ఇది కేవలం ఒక ఇంజిన్ పరీక్ష మాత్రమే కాదని, భారత్‌లో స్వదేశీ పునర్వినియోగ ప్రొపల్షన్ వ్యవస్థ నిర్మాణానికి ఇది బలమైన పునాది అని అన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల సవాల్‌కు కట్టుబడండి

- డబ్బా ఇళ్లు కాదు.. డబుల్ ఇళ్లు కట్టిన ఘనత మాది
- పొంగులేటి సవావల్‌పై కేటీఆర్ ప్రతిసవాల్
- 20 లక్షల ఇళ్లు ఇచ్చాకే ఓట్లు అడుగుతామన్న మంత్రికి మాట నిలబెట్టుకునే దమ్ముందా?



**ప్రజానావ, హైదరాబాద్:** సవాళ్లు చేయడం, పారిపోవడం కాంగ్రెస్ నేతలకు అలవాటేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్లు లేని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడగదని.. డబుల్ బెడ్‌రూం ఇళ్లు లేని గ్రామాల్లో బీఆర్ఎస్ ఓట్లు అడగకూడదని ఇటీవల కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సవాల్ విసిరారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ స్పందించారు. ఆత్మగౌరవ గృహాలు కట్టిన ఆత్మగౌరవ పార్టీ మాది. స్వరాష్ట్రాన్ని సాధించాం.. స్వగృహ స్వప్నాలను సాకారం చేశాం. డబ్బా ఇళ్లు కాదు.. డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించాం. 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాకే ఓట్లు అడుగుతామని ఛాలెంజ్ చేసిన మంత్రికి మాట నిలబెట్టుకునే దమ్ముందా? శపథం చేయడం కాదు.. చేతనైతే చేసి చూపించాలి. 20 లక్షల గృహ ప్రవేశాలు చేయించాకే.. ఓట్లు అడుగుతాం అనే సవాల్‌కు కట్టుబడి ఉండాలి. హైదరాబాద్ నగరంలో లక్ష డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించిన ఘనత మాది. రూ.70 వేలతో మేం అగ్గిపెట్టె ఇళ్లు కట్టలేదు. మేం కట్టిన ఒక్కో ఇల్లు.. 7 ఇందిరమ్మ ఇళ్లతో సమానం. వీకెండ్‌లో ప్రజలు ఇళ్లు కూల్చి వికృతానందం పొందుతున్నారు. రెండున్నరేళ్లలో నగరంలో కట్టిన ఇళ్లు ఎన్ని?పడగొట్టిన ఇళ్లు ఎన్ని?.. దీనిపై శ్వేతపత్రం ప్రకటించే ధైర్యం ఉందా? మీరెన్ని ప్రగల్భాలు పలికినా, డైవర్షన్ డ్రామాలు ఆడినా 420 హామీల ఎన్నికల మోసాన్ని ఎండగట్టకుండా వదిలిపెట్టం' అని కేటీఆర్ పేర్కొన్నారు.

# సబ్బండ వర్గాల గతి మార్చేలా ప్రణాళిక

- సింగరేణి, ఆర్టీసీ కార్మికులను రేవంత్ రెడ్డి సర్కార్ ఘోరంగా మోసం చేస్తోంది
- ఆరేళ్ల క్రితం 20 వేలు అడిగి.. సీఎం అయ్యాక 16 వేలు ఇస్తారా? కనీస వేతనాలపై నయవంచన
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత స్పష్టం
- తెలంగాణ రక్షణ సేనలో చేరిన మాజీ మంత్రి బోడ జనార్ధన్.. గులాబీ కండువా కప్పిన కవిత




**ప్రజానావ, హైదరాబాద్:** రాష్ట్రంలోని సబ్బండ తెలంగాణ వర్గాల సామాజిక, ఆర్థిక స్థితిగతులను మార్చేలా సరికొత్త విప్లవాత్మక అభివృద్ధి ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన సీనియర్ నాయకులు, మాజీ మంత్రి బోడ జనార్ధన్ తన భారీ అనుచరవర్గంతో కలిసి తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీలో చేరారు. బంజరాహిల్స్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో కల్వకుంట్ల కవిత వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. రాజకీయాల్లో అపార అనుభవం ఉన్న బోడ జనార్దన్ చేరికతో పార్టీకి మైలేజ్ పెరగడమే కాకుండా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో టీఆర్ఎస్ మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే కార్మిక శాఖ మంత్రిగా, ఆర్టీసీ ఛైర్మన్‌గా పనిచేసిన జనార్ధన్‌కు పార్టీలో తగిన ప్రాధాన్యత, గౌరవం ఇస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త ఒరవడి సృష్టించేందుకు, సమసమాజ స్థాపన కోసమే తెలంగాణ రక్షణ సేన ఆవిర్భవించిందని కవిత పేర్కొన్నారు. త్వరలోనే తాము ప్రకటించబోయే సంక్షేమ ప్రణాళిక తెలంగాణ సమాజంలో పెను మార్పులు తెస్తుందన్నారు. "కొంతమంది కేవలం ప్రశ్నిస్తారు.. మరికొందరు పోరాటం చేస్తారు. కానీ మా పార్టీ సమస్యను ప్రశ్నించి, పోరాడి, పరిష్కరించే వరకు వదిలిపెట్టదు" అని స్పష్టం చేశారు. తమ 'జనం బాట' కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి వెళ్లడం వల్లే ఇప్పటికే 25 ప్రధాన సమస్యలు పరిష్కారమయ్యాయని గుర్తు చేశారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుపై తాము గళమెత్తడం వల్లే సీఎం రివ్యూ చేశారని, అలాగే నల్గొండలో 35 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న బ్రిడ్జి పనులను జనంబాట ద్వారా ప్రస్తావించడంతోనే ప్రభుత్వం పనులు ప్రారంభించిందని కవిత వివరించారు. రాష్ట్రంలోని సింగరేణి, ఆర్టీసీ సహా అన్ని రంగాల కార్మికులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘోరంగా మోసం చేస్తున్నారని కవిత ఆరోపించారు. కనీస వేతనాలు (మినిమమ్ వేజెస్) ఫిక్స్ చేశామని గొప్పలు చెప్పుకుంటున్న రేవంత్ రెడ్డి.. గతంలో మల్కాజ్‌గిరి ఎంపీగా ఉన్నప్పుడు కార్మికులకు రూ. 20 వేల కనీస వేతనం ఇవ్వాలని నాటి సీఎంకు లేఖ రాశారని గుర్తు చేశారు. తీరా తనే ముఖ్యమంత్రి అయ్యాక, ఆరేళ్ల తర్వాత ఆ వేతనాన్ని రూ. 16 వేలకు తగ్గించి ఇవ్వడం కార్మికులను నయవంచనకు గురిచేయడమేనని మండిపడ్డారు. సింగరేణిలో అవినీతి రాజ్యమేలుతోందని, గతంలో సాధించుకున్న డిపెండెంట్ ఉద్యోగాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఊడబీకే ప్రయత్నం చేస్తోందని ధ్వజమెత్తారు. ఐఎన్‌టీయూసీ హయాంలో కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని, బోడ జనార్ధన్ చేరికతో తమ హెచ్ఎంఎస్ (ఎమ్మా) యూనియన్‌కు సింగరేణిలో మరింత బలం చేకూరుతుందని, కార్మికుల పక్షాన పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను కూడా తీవ్ర అన్యాయానికి గురిచేసిందని కవిత విమర్శించారు. అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియపై మొద్దునిద్ర పోయారని, డ్రైవర్ రాజు గౌడ్ బలిదానం చేసుకునే వరకు ఈ ప్రభుత్వానికి చలనం రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్ల కొనుగోలుపై ప్రశ్నించిన ఒక ఆర్టీసీ డ్రైవర్‌ను ఉద్యోగం నుంచి తొలగిస్తే, తాము పెద్ద ఎత్తున పోరాటం చేయడం వల్లే ప్రభుత్వం వెనక్కి తగ్గిందని, రాష్ట్రంలో ప్రశ్నిస్తే తట్టుకోలేని కర్కశ పాలన సాగుతోందని మండిపడ్డారు.

### కవిత విజన్‌కు ఆకర్షితుడినై పార్టీలో చేరా

ఒక మహిళా నాయకురాలు సొంతంగా పార్టీ పెట్టి ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేయడం అభినందనీయమని మాజీ మంత్రి బోడ జనార్దన్ కొనియాడారు. "గతంలో ఎన్టీఆర్ గారు కూడు, గూడు, గుడ్డ నినాదంతో వస్తే.. కేసీఆర్ గారు నీళ్లు, నిధులు, నియామకాలతో వచ్చారు. కానీ కవిత గారు 'పాంచజన్యం' పేరుతో ఐదు కీలక అంశాలను తెరపైకి తెచ్చి ఆ ఇద్దరు మహానాయకుల కంటే ఉన్నతంగా ఆలోచించారు" అని ప్రశంసించారు. కవిత ప్రకటించిన మేనిఫెస్టో నచ్చడం వల్లే తాను టీఆర్ఎస్‌లో చేరుతున్నానని, తెలంగాణకు మహిళ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. ఇకపై కాంగ్రెస్ వైఫల్యాలపై క్షేత్రస్థాయిలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తూ, పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని బోడ జనార్దన్ స్పష్టం చేశారు.

# అర్ధరాత్రి పోలీస్ కార్యాలయం ముందే దారుణం

- యువతిపై ఐదుగురు నేపాలీల దాడి!
- చేయి పట్టి లాగుతూ అసభ్య ప్రవర్తన ధైర్యంగా కేకలు వేసిన బాధితురాలు
- పరుగులు తీసి నిందితులను పట్టుకున్న స్థానికులు.. నడిరోడ్డుపైనే దేహశుద్ధి
- అబిడ్స్ పోలీసులకు అప్పగింత నిందితులంతా ఫాస్ట్ ఫుడ్ సెంటర్ కార్మికులుగా గుర్తింపు
- సీసీఎస్ ఆఫీస్ ముందే ఘటన జరగడంపై నగరంలో తీవ్ర కలకలం



**ప్రజానావ, హైదరాబాద్:** భాగ్యనగరంలో శాంతిభద్రతల పరిరక్షణకు నిలయమైన పోలీస్ కార్యాలయం ముందే ఓ ఒంటరి యువతిపై దుండగులు తెగబడ్డారు. బుధవారం అర్ధరాత్రి బషీర్ బాగ్‌లోని సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) ఆఫీస్ ఎదురుగా నడిరోడ్డుపై జరిగిన ఈ ఘటన నగరంలో తీవ్ర కలకలం రేపింది. ఒంటరిగా వెళ్తున్న యువతి పట్ల ఐదుగురు నేపాలీ యువకులు అత్యంత అసభ్యంగా ప్రవర్తించి, దాడికి యత్నించారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి బషీర్ బాగ్ సీసీఎస్ కార్యాలయం సమీపంలో ఓ యువతి ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తోంది. ఆ సమయంలో అక్కడ కాపుగాచిన ఐదుగురు నేపాలీ యువకులు ఒక్కసారిగా ఆమెపైకి దూసుకొచ్చారు. నడిరోడ్డుపైనే ఆమె చేయి పట్టి లాగుతూ, అసభ్యకరంగా ప్రవర్తించారు. ఈ ఊహించని పరిణామంతో సదరు యువతి తీవ్ర భయాందోళనకు గురైనప్పటికీ, సమయస్ఫూర్తితో ధైర్యం చేసి గట్టిగా కేకలు వేసింది. యువతి అరుపులు విన్న వెంటనే చుట్టుపక్కల ఉన్న స్థానికులు, వాహనదారులు తీవ్ర ఆగ్రహంతో అప్రమత్తమయ్యారు. ప్రమాదాన్ని పసిగట్టి అక్కడి నుంచి పారిపోవడానికి ప్రయత్నించిన ఆ ఐదుగురు దుండగులను స్థానికులు వెంబడించి, నలువైపులా చుట్టుముట్టి పట్టుకున్నారు. నడిరోడ్డుపైనే ఆ ఐదుగురు కామాంధులకు స్థానికులు గట్టిగా దేహశుద్ధి చేశారు. అనంతరం వారిని బంధించి అబిడ్స్ పోలీసు స్టేషన్‌కు తరలించి పోలీసులకు అప్పగించారు. అబిడ్స్ పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా, వీరంతా నగరంలోని ఒక ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో కార్మికులుగా పనిచేస్తున్న నేపాల్ దేశస్థులుగా తేలింది. నిందితులను సునీల్, ఉమేష్, లక్ష్మణ్, పురుషోత్తం, రామ్‌లుగా గుర్తించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఐదుగురు నిందితులపై నిర్భయ సహా పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు అబిడ్స్ పోలీసులు తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించి, కేసు దర్యాప్తును వేగవంతం చేసినట్లు పేర్కొన్నారు. నగర నడిబొడ్డున, అది కూడా పోలీస్ కమీషనరేట్ అనుబంధ కార్యాలయం ముందే ఇలాంటి అఘాయిత్యం జరగడంపై మహిళా సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.




# వరల్డ్ కప్‌లో ఈషా సింగ్ ప్రపంచ రికార్డు

## అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి

### ఈషా ప్రదర్శన భారత క్రీడాకారులకు స్ఫూర్తిదాయకం

**ప్రజానావ, హైదరాబాద్:** జర్మనీలోని మ్యూనిచ్ వేదికగా జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్ షూటింగ్ టోర్నమెంట్‌లో సరికొత్త ప్రపంచ రికార్డుతో సంచలన విజయం సాధించిన హైదరాబాద్ స్టార్ షూటర్ ఈషా సింగ్‌ను తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. బుధవారం రాత్రి జరిగిన మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్ ఫైనల్స్‌లో ఈషా అత్యంత అద్భుతమైన ప్రదర్శనతో ఏకంగా 43 హిట్స్ సాధించి, స్వర్ణ పతకంతో పాటు సరికొత్త ప్రపంచ రికార్డును తన పేరిట లిఖించుకుంది. ఈ చారిత్రాత్మక విజయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ.. అంతర్జాతీయ షూటింగ్ క్రీడా చరిత్రలో ఈషా సాధించిన ఈ ఘనత ఒక చిరస్మరణీయ మైలురాయిగా నిలిచిపోతుందని కొనియాడారు. మన హైదరాబాద్‌కు చెందిన ఈషా సింగ్ తన అంకితభావం, క్రమశిక్షణ, పట్టుదలతో దేశంలోని కోట్లాది మంది యువతకు ఆదర్శంగా నిలిచిందని ప్రశంసించారు. ఆమె కనబరిచిన ఈ అసమాన ప్రతిభ భారతీయ క్రీడాకారులందరికీ కొండంత స్ఫూర్తిని ఇస్తుందని, అలాగే భారత క్రీడల ఉజ్వల భవిష్యత్తుకు ఇదొక నిదర్శనమని సీఎం పేర్కొన్నారు. భవిష్యత్తులో ఈషా సింగ్ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, అంతర్జాతీయ వేదికలపై మరెన్నో విజయాలు సాధించి భారతదేశ కీర్తి పతాకాన్ని ప్రపంచవ్యాప్తంగా రెపరెపలాడించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

# ఫ్యూచర్ సిటీలో భూములకు రికార్డు ధరలు

## రావిర్యాలలో రూ.83,500 పలికిన చదరపు గజం భూమి

### విక్రయాల ద్వారా రూ 140 కోట్లు ఆదాయం

### హౌసింగ్ బోర్డు స్థలాలకు భారీ డిమాండ్

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ రాజధాని క్యూర్ పరిధిలో పెద్దపెద్ద వెంచర్లు చేపట్టడానికి అనువుగా ఉన్న భూములకు భారీగా డిమాండ్ పెరుగుతోంది. అందులోనూ ఎటువంటి వివాదాలు లేకుండా క్లియర్ టైటిల్ లతో ప్రభుత్వానికి చెందిన హౌసింగ్ బోర్డ్ స్థలాలకు డిమాండ్ మరింత భారీగా ఉంఉంటోంది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం, ఫ్యూచర్ సిటీ ఎంట్రన్స్ లో ఎయిర్ పోర్టుకు సమీపంలోని రావిర్యా ల లో భూములను కొనుగోలు చేయడానికి అనేక మంది పోటీపడ్డారు. ఈ ప్రాంతలో ఉన్న హౌసింగ్ బోర్డు భూములకు గురువారం నాడు ఇ–ఆక్షన్ ద్వారా వేలం నిర్వహించారు. మొత్తం నాలుగు భూమలకు నిర్వహించిన వేలం పాటలో చదరపు గజం భూమి గరిష్టంగా రూ. 83,500 కు అమ్ముడు పోయిందని హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ శ్రీ వి.పి.గౌతం తెలిపారు. వెయ్యి నుంచి 13,500 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న నాలుగు లాండ్ పార్సిళ్లకు నిర్వహించిన వేలం పాట ద్వారా సుమారు రూ. 140 కోట్లఆదాయం వచ్చిందని ఆయన తెలిపారు. ఈ భూములను ఇ–ఆక్షన్ లో వేలం పాట ద్వారా విక్రయిస్తున్నట్లు గత నెలలో హోసింగ్ బోర్డు నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ భూములను కొనుగోలు చేయడానికి సుమారు 17 సంస్థలు పోటీ పడ్డాయి. ఇందులో 1113 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న భూమిని కొనుగోలు చేయడానికి బిడ్డర్లు పోటీ పడ్డారు. రూ. 26 వేల కనీసధరను నిర్ధారించగా, దీనిని దక్కించుకోడానికి పోటీ పడుతూ చదరపు గజం రూ. 83,500 కు ఒక డెవలపర్ సంస్థ దక్కించుకుంది. అలాగే ఇదే ప్రాంతంలోని సుమారు 6 వేల చదరపు గజాల విస్తీర్ణంలోని భూమి వేలం పాటలో చదరపు గజం రూ. 62,500 ధరకు అమ్ముడు పోయింది. అంతే కాకుండా సుమారు 13,500 చదరపు గజాల విస్తీర్ణంలోని భూమిని కొనుగోలు చేయడానికి కూడా బిడ్డర్లు పోటీ పడ్డారు. ఈ నాలుగు భూముల వేలం ద్వారా హౌసింగ్ బోర్డుకు సుమారు రూ. 140 కోట్ల మేర ఆదాయం వచ్చింది.

### నేడు కూడా భూముల విక్రయాలు

కెపిహెచ్ బి కాలనీ, కుత్బుల్లాపూర్ చింతల్ ప్రాంతాల్లోని మరో నాలుగు ప్లాట్లకు (భూములకు) శుక్రవారం నాడు ఇ–ఆక్షన్ నిర్వహిస్తున్నారు. కెపిహెచ్ బి కాలనీ ఫేజ్ 1–2 లోని 5,898 చదరపు గజాలు, 2,420 చదరపు గజాల్లోని ప్లాట్ నెం 2, కుత్బుల్లాపూర్ చింతల్ లోని 10,890 చదరపు గజాలు, 3,388 చదరపు గజాల భూములను వేలం ద్వారా విక్రయించనున్నారు.





# తమిళ రాజకీయాల్లో విజయ్ ఎత్తులు!

తమిళనాడు రాజకీయాలు రసవత్తర మలుపులు తిరుగుతున్నాయి. మద్దతుల ఇచ్చిన అన్నా డిఎంకె ఎమ్మెల్యేలు మళ్లీ పళనిస్వామి చెంతకు చేరారు. మేమంతా మీ వెంటే అని ప్రకటించారు. ఈ ప్రభుత్వం ఎక్కువ కాలం మనలేదని డిఎంకె నేత స్టాలిన్ ఇప్పటికే శాపనార్థాలు పెట్టారు. ఈ స్థితిలో కాంగ్రెస, లెఫ్, ముస్లిం పార్టీల మద్దతు బొటాబొటిగా ఉంది. దీంతో మరో ఐదేళ్లపాటు లాక్కురావడం అంత సులభం కాదు. ఎందుకంటే ఐదారు సీట్ల మద్దతుతో వారి గొంతెమ్మ కోర్కెలు తీర్చడం సిఎం విజయ్‌కు తలనొప్పిగా పరిణమించవచ్చు. ఈ క్రమంలో సొంతగా బలం కోసం టివికె అధినేత, సిఎం కొత్త ఎత్తులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ద్రవిడ పార్టీలకు చెక్ పెట్టడంతో పాటు తమిళనాట పాతుకు పోయేందుకు రాజకీయంగా ఎత్తులు వేస్తున్నట్లు పరిస్థితులు తెలియచేస్తున్నాయి. చిల్లర పార్టీలతో కలిసి నడిచేకంటే సొంతగా బలం సమకూర్చుకోవడం ఉత్తమమని ఆయన భావనలో ఉన్నారు. అందుకే ఇటీవల అన్నాడిఎంకెకు చెందిన నలుగురు ఎమ్మెల్యేలు రాజీనామా చేసి విజయ్ పంచన చేరారు. వారు ఉప ఎన్నికల్లో టివికె పార్టీ పక్షాన గెలిస్తే సొంతబలం పెరగవచ్చు. ఇలా సొంత బలం కోసం అవసరమైన ఇతర పార్టీల్లోని ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి గెలిపించుకోవాలన్న ఎత్తుగడలో సిఎం విజయ ఉన్నట్లు సమాచారం. ఓవైపు ప్రజాసంక్షేమ కార్యక్రమాలు చేస్తూ ప్రజల్లో అభిమానం పెంచుకోవడంతో పాటు, పార్టీ బలాన్ని పెంచుకునేలా టివికె చీఫ్ ఎత్తుడగులు సాగుతున్నాయి. అధికారంలో ఉంది మన ప్రభుత్వమే అని డీఎంకే అధినేత ఎం.కె.స్టాలిన్ పార్టీ కార్యకర్తలతో అన్నట్లు విస్తృత ప్రచారంలో ఉంది. మరో సందర్భంలో విజయ్ ప్రభుత్వం కూలిపోయేందుకు సిద్ధంగా ఉందని ఆయనే వెల్లడించారు. ఈ మాటల్ని అనుసరించి.. టీవీకే ప్రభుత్వాన్ని తాను నియంత్రించేస్థాయిలో ఉన్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇది టీవీకేకు మింగుడు పడటంలేదు. మరోవైపు అన్నాడీఎంకే చీలికల కారణంగా మద్దతుగా నిలిచిన 25 మందిలో కొందరు మంత్రి పదవుల్ని ఆశించినట్లు ప్రచారంలో ఉంది. మంత్రివర్గ విస్తరణలో వారికెలాంటి స్థానం లేకపోవడం, కాంగ్రెస్ లో ఇద్దరికి దక్కడంతో పాటు డీఎంకే కూటమిలోని ఐయూఎంఎల్, వీసీకేకు చెరొక మంత్రిపదవి ఇవ్వడంతో అన్నాడీఎంకే చీలిక శ్రేణులు అసంతృప్తిగా ఉన్నట్లు తేలింది. డీఎంకే అధిపత్యం తగ్గించే వ్యూహంలో.. అన్నాడీఎంకే చీలిక ఎమ్మెల్యేలు తమవైపు ఉండటాన్ని లాభంగా మలచుకోవాలని టీవీకే చూస్తోంది. తమ పార్టీలోకి రావాలంటే రాజీనామాలు చేయాలనే షరతు విధించినట్లు విశ్వసనీయంగా చెబుతున్నారు. ఇందులో భాగంగానే నలుగురు రాజీనామా చేసి టీవీకేలో చేరారు. రాజీనామాలు చేసేందుకు మరికొందరు అన్నాడీఎంకే చీలికవర్గం ఎమ్మెల్యేలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. టీవీకేకు అసెంబ్లీ ఎన్నికల్లో మ్యాజిక్ ఫిగర్ రాకపోవడంతో.. ఆ పార్టీకి మద్దతిచ్చే పక్రియలో రెండు ప్రధాన కూటములు ఎవరి ఆట వారు ఆడుతున్నట్లు కనిపిస్తోంది. ఇప్పుడు విజయ్ కొత్త ఆట మొదలుపెట్టారు. పలువురు ఎమ్మెల్యేలతో రాజీనామాలు చేయించి విజిల్ గుర్తుపై బరిలోకి పంపి.. వారిని గెలిపించి.. ఇతర పార్టీల మద్దతు లేని సొంత ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే దిశగా అడుగులు వేస్తున్నారు. ఇటీవల అసెంబ్లీలో జరిగిన బల ప్రదర్శనలో టీవీకే ప్రభుత్వం అనూహ్య మద్దతు కూడగట్టుకుంది. ఏకంగా 144 ఎమ్మెల్యేల బలాన్ని అందుకుంది. ఈ సంఖ్యలోనే అనేక వ్యూహాలు కనిపిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. టీవీకేపై ఆధిపత్యం కోసం ఇటు డీఎంకే కూటమి, అటు అన్నాడీఎంకే ఓ వర్గం అంతర్గత వ్యూహాల్ని రచించినట్లు తెలుస్తోందంటున్నారు. అంతర్గత నిర్ణయాల కారణంగా తమ కూటమిలోని వీసీకే, ఐయూఎంఎల్, సీపీఐ, సీపీఎం పార్టీలకు చెందిన 8 సీట్లను టీవీకే మద్దతుగా ఇచ్చారు. మరోవైపు టీవీకేతో జట్టుకట్టిన కాంగ్రెస్‌కు 5 సీట్లు, ఏఎంఎంకే నుంచి బయటికి వచ్చి స్వతంత్ర అభ్యర్థిగా మద్దతిచ్చిన కామరాజ్ ఓటు కలిపి.. టీవీకేకు 119 సీట్ల వచ్చింది. కోర్టు ఆంక్షలతో తిరపత్తూర్ ఎమ్మెల్యే ఓటింగ్‌కు పాల్గొనలేదు, తిరుచ్చి తూర్పుస్థానం ఖాళీగా ఉండటం, స్పీకర్ ఓటు లెక్కలోకి లేకపోవడంతో టీవీకే బలం 105గా ఉంది. ఇతరుల మద్దతుతో ఓటింగ్‌కు ముందే మ్యాజిక్ ఫిగర్ దాటినట్లు అంచనాలు వచ్చాయి. ఇక అసెంబ్లీలో ఓటింగ్ జరుగుతున్న క్రమంలో అన్నాడీఎంకే చీలికవర్గం నుంచి అనూహ్యంగా మరో 25 ఓట్లు దక్కాయి. దీంతో బలం 144కు చేరింది. రెండు కూటముల నుంచి టీవీకేకు బలం అందడంతో వచ్చే 6నెలలదాకా ప్రభుత్వం కూలడానికి ఉన్న అడ్డంకులన్నీ తొలగిన్లట్టైంది. మద్దతు పార్టీల సంగతి అటుంచితే.. ఇప్పటికిప్పుడు టీవీకే నెమ్మదిగా బలపడుతోంది. సొంతంగా 107 స్థానాలు దగ్గరున్నాయి. 5 కాంగ్రెస్, ఒక స్వతంత్రతో పాటు ప్రస్తుతం ఖాళీగా ఉన్న 5 అసెంబ్లీ స్థానాల్లో గెలిస్తే.. 118 స్థానాల బలమొస్తుంది. అన్నాడీఎంకే చీలిక వర్గంలోని మరికొందరు రాజీనామాలకు సిద్ధపడి టీవీకే గుర్తుపై పోటీ చేసే అవకాశమొస్తే మ్యాజిక్ ఫిగర్ 118ని దాటి స్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే అవకాశముందని రాజకీయ విశ్లేషకుల్లో చర్చ సాగుతోంది. తిరుచ్చి ఈస్ట్‌లో విజయ్‌కు 91,381 ఓట్లు వచ్చాయి. ఈయన డీఎంకేపై 27,416 ఓట్లతో గెలిచారు. ఇక్కడ అన్నాడీఎంకే చీలికవర్గ బలం తోడైతే అవలీలగా లక్ష ఓట్లు దాటొచ్చనేది అంచనా. రాజీనామాలు చేసిన స్థానాల్లో.. చెంగల్పట్టు జిల్లా మదురాంతకం(ఎస్సీ), తిరునెల్వేలి జిల్లా అంబాసముద్రం కలుపుకుని ఇప్పుడు తొలి 3 స్థానాల పార్టీలు టీవీకేవైపు ఉండటంతో ఇక్కడ లక్షన్నర ఓట్లకు తగ్గని బలముంది. 4 రాజీనామా స్థానాల్లో తిరిగి టీవీకే అభ్యర్థి గెలిచే అవకాశాలు సమృద్ధిగా ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ఇలా మరిన్ని స్థానాలు విజయ్‌కి తోడై అవలీలగా, ఒంటరిగా టీవీకే ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, తద్వారా డీఎంకే ప్రభావాన్ని లేకుండా చేయడంతో పాటు స్వేచ్ఛగా పాలన అందించే దిశగా అడుగులు వేసే అవకాశాన్ని టీవీకే పరిశీలిస్తోంది. ఈ సమీకరణాలతో విజయ్ రాష్ట్రంలో మరింత బలపడాలని చూస్తున్నారు. అదే జరిగితే ద్రవిడ పార్టీలకు మనుగడ కష్టమే.

# ఎట్టకేలకు సిద్ధరామయ్య రాజీనామా

- గవర్నర్ కార్యదర్శికి రాజీనామా లేఖ అందచేత
- అధిష్టానం ఆదేశాల మేరకు వైదొలుగుతున్నట్లు ప్రకటన
- జాతీయ రాజకీయాలకు వెళ్లే ఆలోచన లేదని వెల్లడి



**బెంగళూరు:** కర్నాటకానికి తెరపడింది. గతకొంతకాలంగా ఊహాగానాలతో సాగిన రాజకీయాలు మలుపు తిరిగాయి. కర్నాటకలో సిద్ధరామయ్య జమానా ముగిసింది. ఎట్టకేలకు కర్ణాటకలో నాయకత్వ మార్పు చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేశారు. గురువారం మధ్యాహ్నం డీకే శివకుమార్‌తో కలిసి ఆయన లోక్‌భవన్‌కు వెళ్లారు. అయితే, ఆ సమయంలో గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్ అందుబాటులో లేకపోవడంతో ఆయన కార్యదర్శికి సిద్ధరామయ్య తన రాజీనామా లేఖను సమర్పించారు. ఈ విషయాన్ని గవర్నర్ ప్రత్యేక కార్యదర్శి సైతం ధ్రువీకరించారు. సీఎం రాజీనామా లేఖను తీసుకున్నామని, గవర్నర్ తిరిగొచ్చాక దీనిపై నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. గహ్లోత్ ఈ సాయంత్రం బెంగళూరు చేరుకోనున్నారు. అనంతరం మంత్రులు డీకే శివకుమార్, పరమేశ్వరతో కలిసి సిద్ధరామయ్య మీడియాతో మాట్లాడారు. అధిష్ఠానం సూచనలతో సీఎం పదవికి రాజీనామా చేశా. హైకమాండ్ ఆదేశాలకు అందరం కట్టుబడి ఉంటాం. రాష్ట్ర ప్రయోజనాల కోసమే వైదొలిగా. నిబంధనల ప్రకారం ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశా. దాన్ని గవర్నర్ ఆమోదిస్తారనే విశ్వాసం ఉంది. అసెంబ్లీలో కాంగ్రెస్‌కు సంపూర్ణ మెజార్టీ ఉంది. రాజ్యాంగబద్ధంగా కొత్త ప్రభుత్వం ఏర్పడుతుంది. ఇప్పటివరకు ప్రభుత్వ నిర్వహణలో నాకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు. సీఎంగా నాకు అవకాశమిచ్చిన సోనియా, రాహుల్, ఖర్గేకు కృతజ్ఞతలు. 7 కోట్ల మంది కర్ణాటక ప్రజలకు సేవ చేసే అవకాశం లభించింది. రాజ్యాంగమే మా ధర్మం. ప్రజలే మాకు దేవుళ్లు అని సిద్ధరామయ్య తెలిపారు. జాతీయ రాజకీయాల్లోకి రావాలని హైకమాండ్ అడిగింది. రాజ్యసభ సీటు ఆఫర్ చేసింది. కానీ, నేను సున్నితంగా తిరస్కరించా. జాతీయ స్థాయి రాజకీయాలపై నాకు ఆసక్తి లేదు. అయితే, రాజకీయాల నుంచి వైదొలిగే ప్రసక్తే లేదు. ప్రజలు నన్ను 5 ఏళ్ల కాలానికి ఎన్నుకున్నారు. ఇంకా రెండేళ్లు మిగిలి ఉన్నాయి. అప్పటివరకు ఎమ్మెల్యేగానే కొనసాగుతానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తన రాజకీయ ప్రస్థానాన్ని, పదవీకాలాన్ని గుర్తుచేసుకుంటూ సిద్ధరామయ్య ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. నేను పొరపాటున రాజకీయాల్లోకి వచ్చా. మా కుటుంబంలో అంతకుముందు ఎవరూ రాజకీయాల్లో లేరు. 2006లో కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి హైకమాండ్ నన్ను ఆదరించింది. సీఎం అవుతానని కలలో కూడా అనుకోలేదు. అలాంటిది ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా రెండేసిసార్లు సేవలందించాను. మ్యానిఫెస్టోలో ఇచ్చిన 160 హామీల్లో 158 నెరవేర్చా. మొదటి ఏడాదిలోనే ఐదు గ్యారెంటీలు అమలు చేశాం. నాపై ప్రతిపక్షాలు వదంతులు ప్రచారం చేశాయి. కానీ, నా రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం. పదవి కోసం, డబ్బు కోసం ఏనాడూ పాకులాడలేదని సిద్ధరామయ్య వివరించారు.

ఈ క్రమంలో అధిష్టానంతో భేటీకి సిద్ధరామయ్య దిల్లీ వెళ్లనున్నట్లు సమాచారం. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో భేటీ కానున్నారు. కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యేల సమావేశానికి సంబంధించి నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. సిద్ధరామయ్య స్థానంలో రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ బాధ్యతలు చేపట్టడం దాదాపు ఖాయంగానే కనిపిస్తోంది. శనివారం జరిగే సీఎల్పీ సమావేశంలో కొత్త శాసనసభాపక్ష నేతను ఎన్నుకునే అవకాశం ఉంది. ప్రమాణస్వీకార కార్యక్రమంపై అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు.

# ఉక్రెయిన్‌తో ఎడతెగని రష్యా యుద్ధం

## భారీగా సైనిక సంపదను కోల్పోయిన రష్యా

## 5లక్షల మంది సైన్యం మరణించినట్లు వార్తలు

**మాస్కో:** రష్యా-ఉక్రెయిన్ మధ్య నాలుగేళ్లుగా కొనసాగుతోన్న యుద్ధం ఎప్పటికి ముగుస్తుందో తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో కొన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. 2022 నుంచి జరుగుతోన్న ఈ ఘర్షణల్లో రష్యాకు సైనిక పరంగా భారీ నష్టం వాటిల్లినట్లు కనిపిస్తోంది. ఈ పోరులో 5 లక్షల మంది మాస్కో సైనికులు ప్రాణాలు కోల్పోయారని బ్రిటన్ నిఘా వర్గాలు అంచనావేశాయి. మరోవైపు, యుద్ధం ప్రారంభమైన దగ్గరి నుంచి తాము 55వేలమంది సైనికులను కోల్పోయినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఈ ఫిబ్రవరిలో వెల్లడించారు. ఇరువైపులా ప్రాణనష్టం భారీగానే ఉన్నా.. రెండు దేశాలు వాస్తవ లెక్కలను వెల్లడించట్లేదనే ఆరోపణలున్నాయి. గత నాలుగేళ్లుగా డాన్‌బాస్ ప్రాంతంలోని ఉక్రెయిన్ స్థావరాలపై దాడుల కోసం రష్యా తన సైనికులను దశలవారీగా మోహరించింది. కొత్తగా చేరిన సైనికులు, జైళ్ల నుంచి నియమించుకున్నవారు ఈ ఘర్షణల్లో పాల్గొన్నారు. వారికి సరైన శిక్షణ లేకపోవడం.. యుద్ధరంగంలో భారీగా ప్రాణనష్టానికి దారితీస్తున్నట్లు కనిపిస్తోంది. మరోవైపు, అమెరికా, దాని మిత్రదేశాలు సరఫరా చేసే క్షిపణి వ్యవస్థలు, ఫిరంగి, అధునాతన డ్రోన్లను ఉక్రెయిన్ ఉపయోగిస్తోంది. కమాండ్ పోస్టులు, సైనిక సమూహాలు లక్ష్యంగా జెలెన్‌స్కీ సైన్యం దాడులు చేస్తోంది. దాంతో ఈ నష్టం మరింత పెరిగిందనే అంచనాలున్నాయి. ఈ దాడులను ఎదుర్కొనేలా రష్యా సుశిక్షితులైన సైనికులను నియమించుకోలేక పోతుందని, విధుల్లో ఉన్నవారిని కాపాడుకునేలా ఎలాంటి రక్షణకవచాలను సమీకరించలేకపోతుందని యూకే నిఘా వర్గాలు అంచనా వేశాయి. ఈ కారణాలే రష్యాను దెబ్బతీస్తున్నట్లు విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే.. ఆర్మీలో యువతను చేర్చుకునేందుకు రష్యా ప్రభుత్వం వారికి పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు ప్రకటిస్తోంది. ఇందులో భాగంగా రక్షణశాఖతో ఒప్పందం కుదుర్చుకునే వారికి, వారి కుటుంబాలకు ఉండే రుణాల్లో 10 మిలియన్ రూబుల్స్ (సుమారు రూ.1.33కోట్లు) వరకు మాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. కొత్తగా సైన్యంలో చేరాలనుకునే వారు కనీసం ఏడాది పాటు కొనసాగుతానని హామీ ఇవ్వాల్సి ఉంటుందని, ఇందుకు సంబంధించిన నిర్ణయంపై అధ్యక్షుడు పుతిన్ సంతకం చేసినట్లు వార్తలు వచ్చాయి.

# పరస్పర సహకారంతో జల వివాదాల పరిష్కారం

## కెన్-బెట్వా నదుల అనుసంధాన ప్రాజెక్టుపై మోదీ సమీక్ష



**న్యూఢిల్లీ:** అంతర్రాష్ట్ర జల వివాదాలను సహకార ధోరణితో పరిష్కరించుకోవాలని రాష్ట్రాలకు ప్రధాని నరేంద్ర మోదీ సూచించారు. సకాలంలో అనుమతులు, సాంకేతికత ఆధారిత పర్యవేక్షణ ద్వారా ఈ సమస్యలను అధిగమించాలన్నారు. ఈ విషయంలో కెన్-బెట్వా ప్రాజెక్టు ఓ నమూనాగా నిలవాలని చెప్పారు. కెన్-బెట్వా నదుల అనుసంధాన ప్రాజెక్టు సహా ఆయా రాష్ట్రాల్లో రూ.30 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులపై ప్రధాని సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టుల అమలులో జాప్యం.. ఖర్చుల పెరుగుదలకు దారితీయడమే కాకుండా, పౌరులకు అవసరమైన సౌకర్యాలను సకాలంలో అందకుండా చేస్తుందని మోదీ వ్యాఖ్యానించినట్లు ప్రభుత్వం ఓ ప్రకటనలో వెల్లడించింది. నీటి భద్రత కోసం నదుల అనుసంధానం, జల సంరక్షణ, భూగర్భ జలాల పునరుజ్జీవం వంటి అంశాల్లో అవకాశాలను గుర్తించాలని రాష్ట్రాలకు మోదీ సూచించారు. 'స్వచ్ఛభారత్ మిషన్- అర్బన్ 2.0'ను కూడా సమీక్షించారు. నగరాల్లో రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్ల వినియోగాన్ని వేగవంతం చేయాల్సిన అవసరాన్ని చాటిచెప్పారు. కాల్వల వెంబడి, కాల్వలపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు మార్గాలనూ అన్వేషించాలని సూచించారు. ఘన వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన మౌలిక సదుపాయాలను కూడా వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు.

# పశ్చిమాసియాలో సడలని ఉద్రిక్తతలు

## అమెరికా దాడులకు ప్రతీకార దాడులు

**టెహ్రాన్:** పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఓవైపు శాంతి ఒప్పందంపై చర్చలు కొనసాగుతుండగానే.. అమెరికా- ఇరాన్ మధ్య భీకర ఘర్షణలు చోటుచేసుకున్నాయి. హర్మూజ్ సమీపంలో అమెరికా దాడులకు ప్రతీకారంగా ఇరాన్ క్షిపణులు ప్రయోగించింది. అగ్రరాజ్య సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు చేపట్టింది. హర్మూజ్ జలసంధి సమీపంలోని ఇరాన్ సైనిక స్థావరాలపై అమెరికా దళాలు దాడులు చేశాయి. ఇది జరిగిన కాసేపటికే బందర్ అబ్బాస్ పోర్టు వద్ద కూడా పలుమార్లు పేలుడు శబ్దాలు వినిపించాయి. ఈ దాడులను ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ దురాక్రమణ చర్యగా అభివర్ణించింది. అమెరికా పదే పదే కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తుందని ఇరాన్ ఆరోపించింది. ఇలాంటి దురాక్రమణలు కొనసాగితే.. తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. అంతేగాక, తాజా దాడులకు ప్రతీకారంగా గల్ఫ్ దేశాల్లోని అమెరికా బేస్‌లను తాము లక్ష్యంగా చేసుకున్నట్లు ఐఆర్‌జీసీ తెలిపింది. కానీ, అది ఎక్కడి స్థావరం అనే విషయాన్ని వెల్లడించలేదు. అయితే తమ గగనతలంపైకి క్షిపణులు, డ్రోన్‌లు దూసుకొచ్చాయని కువైట్ దళాలు పేర్కొన్నాయి. వాటిని సమర్థవంతంగా అడ్డుకున్నట్లు వెల్లడించాయి.

# రైతుగా మారిన టెకీ.. పిడుగుపాటుకు హఠాన్మరణం



**బెంగళూరు:** సాఫ్ట్‌వేర్ జాబ్‌ను వదిలి వ్యవసాయ రంగంలోకి దిగిన ఒక వ్యక్తి పొలంలో పిడుగుపాటుకు గురై మరణించాడు. ఈ విషాద ఘటన బుధవారం కర్ణాటకలో చోటుచేసుకుంది. స్థానిక మీడియా కథనాల ప్రకారం, మడికేరి టౌన్‌కు చెందిన రోషన్ బాలకృష్ణ ఇటీవలే సాఫ్ట్‌వేర్ జాబ్‌కు రాజీనామా చేసి వ్యవసాయ రంగంలోకి దిగారు. తన స్నేహితుడితో కలిసి పనిచేస్తున్నారు. వ్యవసాయ యంత్రాల మార్కెటింగ్ కూడా చేస్తున్నారు. ఈ క్రమంలో తన కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు నిర్ణయించిన ఆయన మైసూరులోని ఒక పొలాన్ని పరిశీలించేందుకు వెళ్లారు. ఆయన వెంట భార్య, కొడుకు కూడా వెళ్లారు. ఈ క్రమంలో పొలం సమీపంలోని చెట్టు నుంచి మామిడి పండును ఆయన కోసేందుకు ప్రయత్నిస్తుండగా పిడుగు పడింది. దీంతో, కుప్పకూలిన రోషన్ ఘటనా స్థలంలోనే మరణించారు. ఈ ఘటనలో మరో వ్యక్తి కూడా స్వలంగా గాయపడ్డారు. బాధిత కుటుంబానికి జిల్లా విపత్తు నిర్వహణ విభాగం రూ.5 లక్షల పరిహారాన్ని ప్రకటించింది. ఇందులో రూ.4 లక్షలు రాష్ట్ర విపత్తు నిర్వహణ నిధి నుంచి, మిగతా మొత్తం కేంద్ర ప్రభుత్వ నిధి నుంచి బాలకృష్ణ కుటుంబానికి అందజేయనున్నారు.

# ప్రధాని కార్యాలయ పర్యవేక్షణలో నీట్ టెస్ట్

## పకడ్బందీ చర్యలకు దిగిన కేంద్రం

**న్యూఢిల్లీ:** నీట్ పేపర్ లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దాంతో మే 3న జరిగిన ప్రవేశపరీక్ష రద్దు కావడంతో.. జూన్ 21 రీటెస్ట్ నిర్వహించేందుకు కేంద్ర విద్యాశాఖ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మరోసారి ఎలాంటి లోపాలు తలెత్తకుండా కేంద్రం చర్యలు తీసుకుంటోంది. ఈసారి రీటెస్ట్ పక్రియను ప్రధానమంత్రి కార్యాలయం నిశితంగా పరిశీలిస్తున్నట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దిల్లీలోని తన నివాసంలో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీట్ రీటెస్ట్ (ఔఇఇ÷ు-జఉ స౹బి౹బబి)లో ఎలాంటి అవకతవకలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. తాజాగా జరిగిన సమావేశంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా, ఎన్టీఏ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్, పీఎంఓ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పేపర్ తయారు చేయడం, ప్రింటింగ్, ట్రాన్స్‌పోర్టేషన్, పరీక్షా కేంద్రాలకు చేర్చడం వంటి ప్రతి పక్రియను ప్రధాన మంత్రి కార్యాలయం పర్యవేక్షించనుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ పరీక్షకు సంబంధించి ప్రతి అప్‌డేట్‌ను మోదీ తెలుసుకుంటున్నారని పేర్కొన్నాయి. ఈ రీటెస్ట్‌కు దేశవ్యాప్తంగా 23 లక్షల మంది హాజరుకానున్నారు.

# నేతన్నల పిల్లలు ఐఐహెచ్‌టి కోర్సులో చేరాలి

- టెక్స్ టైల్ రంగంలో అంతర్జాతీయ స్థాయిలో కీర్తి కెరటం ఎగురవేయాలి
- మర మగ్గాల ఖార్కానాల్లో నేతన్నలకు అవగాహన
- చేనేత జౌళి శాఖ కోఆర్డినేటర్ వేముల మార్కండేయులు



**ప్రజానావ, సిరిసిల్ల :** సిరిసిల్ల పవర్లూమ్ పరిశ్రమ కు చెందిన విద్యార్థులు టెక్స్టైల్ రంగంలో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో తమ కీర్తి కెరటం ఎగరవేయాలని, ఇందుకోసం ఐఐహెచ్ టి కోర్సును విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో అభ్యసించాలని చేనేత జౌళి శాఖ కోఆర్డినేటర్ వేముల మార్కండేయులు కోరారు. ఈ మేరకు గురువారం సిరిసిల్ల పట్టణంలో చంద్రంపేట జ్యోతి నగర్ వార్డులో మరమగ్గాల కార్ఖానాలో చేనేత జౌళి శాఖ కోఆర్డినేటర్ వేముల మార్కండేయులు ఆధ్వర్యంలో మురముగ్గాల కార్మికులకు, ఆసాములకు, చేనేత కార్మికుల తల్లిదండ్రులకు, విద్యార్థులకు ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్ లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్ టి) పై అవగాహన కల్పించారు. విద్యార్థులను కలసి కరపత్రాలను, దరఖాస్తు ఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా వేముల మార్కండేయులు మాట్లాడుతూ టెక్స్టైల్ కోర్సు ప్రయోజనాలను వివరించారు. పదవ తరగతి పాస్ ఉంటే సరిపోతుందని, విద్యార్థిని విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ముందుకు రావాలని కోరారు. జూన్ 2 వరకు చివరి తేదీ ఉన్నందున ఆసక్తి గల విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. రాష్ట్రస్థాయిలో 60 సీట్లు మాత్రమే ఉన్నాయని, ఇప్పటి వరకు సిరిసిల్ల నుండి 31 మంది విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకున్నట్టు తెలిపారు. ఈ కోర్సును అభ్యసించడానికి సిరిసిల్ల జిల్లాలో వేముల మార్కండేయులు కృషి చేస్తున్నారు. చేనేత కార్మికుల పిల్లలు టెక్స్టైల్ కోర్సు పూర్తి చేయడానికి ముందుకు రావాలని కోరారు. చేనేత పవర్లూమ్ పరిశ్రమకు చెందిన తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ రంగం వైపు ప్రోత్సహించాలని మార్కండేయులు కోరారు. భారతదేశంలో విస్తృత రంగం వ్యవసాయ రంగం తర్వాత టెక్స్టైల్ రంగం మాత్రమే. సిరిసిల్ల పరిశ్రమకు చెందిన విద్యార్థులు ముందుకు రావాలని, విద్యార్థులకు ఇది మంచి అవకాశం అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2500 రూపాయలు ఇస్తూ... కేంద్ర ప్రభుత్వం 5000 రూపాయల స్కాలర్షిప్ ఇస్తూ, ప్రభుత్వ ఉద్యోగం కూడా కల్పించే సువర్ణ అవకాశం నేటి విద్యార్థులకు ఒక వరం అని తెలిపారు. చేనేత వారసత్వ సంపద పరిరక్షణ కోసం విద్యార్థులు యువత భాగస్వామ్యం కావాలని, అప్పుడే భవిష్యత్ తరాల కోసం చేనేత కలను అందించిన వాళ్ళం అవుతామని అన్నారు. నరాలను పోగులుగా చేసి... రక్తాన్ని రంగుగా మార్చి... గుండెలను కండేలుగా మార్చి... చెమట చుక్కలను చీరలుగా మార్చి... పేగులను వస్త్రాలుగా తయారు చేస్తున్న చేనేత కార్మికుల పిల్లలను టెక్స్టైల్ ఇంజనీర్లుగా తయారు చేయడానికి ప్రభుత్వం టెక్స్టైల్ కోర్సును ప్రోత్సహిస్తుందని, ఐఐహెచ్ టి యూనివర్సిటీ ని నెలకొల్పిందన్నారు. మన భారతీయ సంస్కృతి సాంప్రదాయాలకు చేనేత వస్త్రాలు నిలువుటద్దం. చేనేత వృత్తిని తయారు చేసే వృత్తి నిపుణులుగా తయారు చేయడం జరుగుతుంది. ప్రభుత్వం టెక్స్టైల్ కోర్సు ద్వారా విద్యార్థులకు బంగారు భవిష్యత్తు కల్పిస్తుంది. భారత దేశంలో అనేక రాష్ట్రాలలో ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో ఉపాధి అవకాశాలు ఉన్నాయని వేముల మార్కండేయులు ఈ సందర్భంగా తెలిపారు. తమ పిల్లలకు ఈ కోర్సు పట్ల అవగాహన కలిగించాలని, ఈ సంవత్సరం 2026 – 27 అడ్మిషన్లు ప్రారంభమైనవని, ఆసక్తి గల విద్యార్థులు వెంటనే తమ పేర్లను రైతుల నేతన్నల మనోధైర్య హెల్ప్ లైన్... వేముల మార్కండేయులు. సెల్.. 9948394061 .. టెక్స్టైల్ హెల్ప్ లైన్ కు ఫోన్ చేయాలని తెలిపారు.

# ప్రభుత్వ విద్యా పరిరక్షణకు పోరాడుదాం

- జూన్ 5న చలో హైదరాబాద్ ర్యాలీ, ధర్నాను విజయవంతం చేద్దాం
- సిరిసిల్లలో తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర సహ ప్రధాన కార్యదర్శి ఎం రఘు శంకర్ రెడ్డి పిలుపు
- టీఎస్ఈసి సిరిసిల్ల జిల్లా శాఖ విస్తృత సమావేశం
- ధర్నా పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరణ




**ప్రజానావ, సిరిసిల్ల :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న అపసవ్య విధానాల వలన రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా రంగం రోజురోజుకు నిర్వీర్యమై, సంక్షోభం లోకి నెట్టబడుతున్నదని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర సహ ప్రధాన కార్యదర్శి ఎం రఘు శంకర్ రెడ్డి అన్నారు. గురువారం తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ(టీఎస్ఈసి) రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ విస్తృత సమావేశం జిల్లా అధ్యక్షులు దుమాల రమానాథ్ రెడ్డి అధ్యక్షతన స్థానిక గీతానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా తెలంగాణ విద్యాపరక్షణ కమిటీ రాష్ట్ర సహ ప్రధాన కార్యదర్శి ఎం రఘుశంకర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ విద్యా ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ విధానాలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ విద్య ఉనికిని, భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్న వైఖరికి నిరసనగా తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో జూన్ 5, 2026 రోజున హైదరాబాదులో ర్యాలీ, ఇందిరాపార్క్ వద్ద 'ధర్నా' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన మేరకు విద్యా రంగానికి 20 శాతం నిధులు కేటాయించాలని, పాఠశాలలు, మౌలిక భౌతిక వసతులు మెరుగుపరచాలని, అలాగే విద్యను కేంద్రీకరించే విధంగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణాలను నిలిపివేయాలని, ప్రస్తుత గురుకులాలు ఉన్న ప్రాంతాలలోనే నిర్వహించాలని, అలాగే తెలంగాణ విద్యా కమిషన్ సిఫారసు మేరకు నిర్మించాలనుకున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు కూడా మానుకోవాలని, ప్రస్తుత ఉన్న పాఠశాలల్లోనే సెమీ రెసిడెన్షియల్ పాఠశాలలుగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. అలాగే జాతీయ విద్య విధానం 2020 అమలును తెలంగాణ ప్రభుత్వం తిరస్కరించాలని కోరారు. ముఖ్యంగా రాష్ట్రంలోని ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, పౌర సమాజం అందరూ కలిసి ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలని, పరిరక్షించుకోవాలని బాధ్యతగా ముందుకు రావాలని బుద్ధి జీవులు, విద్యావేత్తలు ఆలోచించాలని రఘుశంకర్ రెడ్డి పిలుపు నిచ్చారు. అనంతరం ధర్నా కరపత్రాలను, వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో తెలంగాణ విద్యాపరి రక్షణ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి వంగ తిరుపతి జిల్లా, గౌరవ అధ్యక్షులు ఏ రాజేశ్వరరావు, టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వికృతి అంజయ్య, డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు అవురం సుధాకర్ రెడ్డి, జిల్లా,రాష్ట్ర నాయకులు డిటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు బూరసదానందం, దొంతుల శ్రీహరి, మైలారం తిరుపతి, టి సురేష్, ఎన్. పర్షరాములు,జి. శ్రీనివాస్, బి. రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# తడిసిన ధాన్యం విషయంలో రైతులు ఆందోళన చెందవద్దు

**వర్షానికి తడిసిన 10 మెట్రిక్ టన్నుల ధాన్యం రైస్ మిల్లుకు తరలింపు**

**ప్రజానావావ, సిరిసిల్ల :** తడిసిన ధాన్యం విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని అధికార యంత్రాంగం భరోసా ఇస్తుంది. అకాల వర్షాలకు తడిసిన వెంటనే ధాన్యం రైస్ మిల్లుకు తరలించి రైతాంగానికి భరోసా ఇచ్చింది. జిల్లాలో అకాల వర్షం కురిసి ముస్తాబాద్ మండలం పోతుగల్ లోని ఐకేపీ కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం వెంటనే స్పందించింది. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచనతో ఐకేపీ, పౌర సరఫరాల శాఖ అధికారులు కొనుగోలు కేంద్రానికి చేరుకొని దాదాపు 10 మెట్రిక్ టన్నుల తడిసిన ధాన్యాన్ని వెంటనే నామాపూర్ గ్రామంలోని బాలాజీ రైస్ ఇండస్ట్రీస్ కు తరలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు చేసి భరోసా కల్పించారు. జిల్లాలో నిన్నటివరకు 2 లక్షల 23 వేల 709 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని వెల్లడించారు. కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు అప్రమత్తంగా ఉండేలా సూచనలు చేస్తున్నామని, వర్షం కారణంగా ధాన్యం తడిస్తే రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. ధాన్యం కొనుగోలు చేస్తామని అధికారులు స్పష్టం చేశారు.





# ప్రొఫెసర్ నాగేశ్వర్‌ను కలిసిన టీఆర్ఎస్ బృందం



**ప్రజానావావ, హైదరాబాద్:** ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు ప్రొఫెసర్ కే.నాగేశ్వర్ కు తెలంగాణ రక్షణ సేన సంపూర్ణ మద్దతు ప్రకటించింది. టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత ఆదేశాలతో రాష్ట్ర నాయకుల బృందం గురువారం నాగేశ్వర్ ను ఆయన నివాసంలో కలిసి మాట్లాడారు. ఏపీ ప్రభుత్వం కక్ష పూరితంగా నాగేశ్వర్ పై పెట్టిన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని టీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. జర్నలిజం గురువుగా, రాజకీయ విశ్లేషకుడిగా నాగేశ్వర్ తెలంగాణకు ఐకాన్ లాంటి వారని చెప్పారు. ఆయనపై తప్పుడు కేసులు పెట్టి అరెస్ట్ చేస్తే హైదరాబాద్ లోని ఏపీ సీఎం చంద్రబాబు ఇంటిని ముట్టడిస్తామని గతంలోనే కవిత ప్రకటించారని గుర్తు చేశారు. నాగేశ్వర్ జోలికి వస్తే తెలంగాణలో ఉద్యమం లేవదీస్తామని హెచ్చరించారు. రాజకీయ విశ్లేషణలను సానుకూల దృక్పథంతో తీసుకోవాలని సూచించారు. తమ మద్దతు సంపూర్ణంగా ఉంటుందని నాగేశ్వర్ కు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు ఆర్వీఆర్ ప్రసాద్, డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్, పుస్కూరి శ్రీకాంత్ రావు, మహేందర్ రెడ్డి, కనిష్క మహేందర్ రెడ్డి, మంచాల వరలక్ష్మి, డేవిడ్, ప్రవీణ్ ముదిరాజ్ పాల్గొన్నారు.



## జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు

# సిరిసిల్ల కిక్ బాక్సర్లు

**జిల్లా కేంద్రం నుండి బయలుదేరిన కిక్ బాక్సర్లు**

**ప్రజానావ, సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కిక్ బాక్సర్లు ఒరిస్సా రాష్ట్రానికి గురువారం బయలుదేరి వెళ్లారు. ఈనెల 30వ తేదీ శనివారం నుండి జూన్ 3, 2026 బుధవారం వరకు ఐదు రోజులు కుర్ద లోని కే టి గ్లోబల్ స్కూల్ నందు జరిగే జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ జూనియర్ పోటీలకు రాజన్నసిరిసిల్ల జిల్లా నుండి స్పోర్ట్స్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ తరపున మాస్టర్ వోడ్నాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇద్దరు కిక్ బాక్సర్లు చోడిబోయిన లోకేష్, ఎర్నాల రాజశేఖర్ లు పాయింట్ ఫైట్, కిక్ లైట్, మ్యూజికల్ ఫామ్ ఈవెంట్ల లో పాల్గొనడానికి బయలు దేరారు. వీరికి కోచ్ గా ఎనగందుల శ్రీనివాస్ వ్యవహరిస్తున్నాడని స్పోర్ట్స్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వోడ్నాల శ్రీనివాస్ తెలిపారు.

# డీజిల్ లేదంటూ గర్భిణికి అంబులెన్స్ నిరాకరణ

**ప్రజానావ, ముంబై :** మహారాష్ట్రలోని హింగోలిలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. డీజిల్ లేదని కారణం చెబుతూ 102, 108 ప్రభుత్వ అంబులెన్స్ సిబ్బంది గర్భిణికి సేవలు అందించేందుకు నిరాకరించడంతో నవజాత శిశువు ప్రాణాలు కోల్పోయింది. హింగోలికి చెందిన మనీషా ఇంగ్లేకు ప్రసవ వేదనలు రావడంతో కుటుంబ సభ్యులు అత్యవసర అంబులెన్స్ సేవలకు సమాచారం ఇచ్చారు. అయితే డీజిల్ లేదంటూ ప్రభుత్వ అంబులెన్స్‌లు రావడానికి నిరాకరించాయని కుటుంబ సభ్యులు ఆరోపించారు. దీంతో తీవ్ర ఆందోళనకు గురైన వారు ప్రైవేట్ అంబులెన్స్ కోసం ప్రయత్నించారు. దాదాపు రెండున్నర గంటల ఆలస్యంతో గర్భిణిని ప్రైవేట్ అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆలస్యం కావడంతో శిశువు మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యమే తమ బిడ్డ మృతికి కారణమని ఆరోపిస్తూ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

# 28 రోజుల్లోనే దర్యాప్తు పూర్తి

**నసరాపూర్ బాలిక హత్య కేసులో నిందితుడిపై అభియోగాలు ఖరారు**

**ప్రజానావ, ముంబై :** మహారాష్ట్రలోని పూణె జిల్లా నసరాపూర్ బాలికపై లైంగిక దాడి, హత్య కేసులో ప్రత్యేక కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసులో నిందితుడు భీమరావు కాంబ్లేపై ఇండియన్ కోడ్ ఆఫ్ జస్టిస్–2023, పోక్సో చట్టంలోని పలు సెక్షన్ల కింద అభియోగాలను కోర్టు నిర్ధారించింది. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన నేపథ్యంలో పోలీసులు వేగంగా దర్యాప్తు చేపట్టారు. కేవలం 28 రోజుల్లోనే కేసు దర్యాప్తును పూర్తి చేసి చార్జ్‌షీట్‌ను దాఖలు చేశారు. అనంతరం ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక కోర్టులో ఇన్–కెమెరా విచారణ నిర్వహించారు. విచారణ సందర్భంగా పోస్టుమార్టం నివేదికలు, వైద్య ఆధారాలు, ఇతర కీలక సాక్ష్యాలను ప్రాసిక్యూషన్ కోర్టుకు సమర్పించింది. మరోవైపు నిందితుడి తరఫు న్యాయవాదులు సరైన ఆధారాలు చూపడంలో విఫలమయ్యారని కోర్టు గమనించింది. దీంతో భీమరావు కాంబ్లేపై నమోదైన అభియోగాలు ప్రాథమికంగా బలంగా ఉన్నాయని భావించిన ప్రత్యేక కోర్టు కేసును తదుపరి విచారణకు స్వీకరించింది. ఈ కేసులో వేగవంతమైన దర్యాప్తు, త్వరితగతిన చార్జ్‌షీట్ దాఖలు చేయడంపై ప్రజలు పోలీసులను అభినందిస్తున్నారు.

# నకిలీ జీవోలతో భూ కబ్జాకు యత్నం

**నార్సింగి సర్వే నంబర్ 18 భూమిపై అక్రమార్కుల కన్ను**

**తహసీల్దార్ ఫిర్యాదు.. ముగ్గురిపై కేసు**

**కోర్టు సెర్చ్ వారెంట్లతో ఇళ్లల్లో, గండిపేటలో పోలీసుల సోదాలు**

**ప్రజానావ, నార్సింగి:** రంగారెడ్డి జిల్లా నార్సింగి పరిధిలోని సర్వే నెం. 18లో ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు నకిలీ జీవోలు సృష్టించిన ఘటన సంచలనంగా మారింది. ప్రభుత్వం తమకు భూమిని కేటాయించినట్లు తప్పుడు పత్రాలు తయారు చేసి ప్రచారం నిర్వహించడమే కాకుండా, హైకోర్టులో కూడా తప్పుడు ఆధారాలతో కేసులు దాఖలు చేసినట్లు ఆరోపణలు వెలుగుచూశాయి. ఈ వ్యవహారంపై తాజాగా హైకోర్టు కేసును కొట్టివేయడంతో అసలు విషయం బయటపడింది. దీంతో ఫేక్ జీవోలు సృష్టించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వేణుగోపాల్ గౌడ్, నిమ్మల భాగస్వామి గౌడ్, నిమ్మల రాజేష్ గౌడ్‌లపై నార్సింగి తహసీల్దార్ పోలీసులకు అధికారికంగా ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూములపై నకిలీ పత్రాలతో అక్రమ హక్కులు సాధించేందుకు ప్రయత్నించిన ఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన నార్సింగి పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. కోర్టు నుంచి సెర్చ్ వారెంట్లు పొందిన పోలీసులు నిందితుల నివాసాలతో పాటు గండిపేట గ్రామంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భారీ సంఖ్యలో బలగాలను మోహరించారు. కేసుకు సంబంధించిన పత్రాలు, నకిలీ జీవోలు, ఇతర కీలక ఆధారాల కోసం అధికారులు గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. ఈ వ్యవహారంలో మరికొందరి పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో దర్యాప్తును మరింత విస్తరించే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

## రాష్ట్ర టీయూవి కార్యదర్శిగా ఎల్తూరి శంకర్



**ప్రజానావావ, మంచిర్యాల:** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి కి చెందిన ఎల్తూరి శంకర్ తెలంగాణ ఉద్యమకారుల వేదిక (టీయూవీ) రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు టీయూవీ వ్యవస్థాపక చైర్మన్ నరాల సత్యనారాయణ, వైస్ చైర్మన్ తోడేటి శంకర్ గౌడ్‌లు ఆయనకు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎల్తూరు శంకర్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి, ప్రభుత్వపరంగా వారికి లభించాల్సిన అన్ని రకాల సహాయ సహకారాలు అందేలా చూడటమే సంస్థ ముఖ్య ఉద్దేశమన్నారు. అలాగే,గతంలో ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలు కోసం నిరంతరం పోరాడేందుకే తెలంగాణ ఉద్యమకారుల వేదికను ఏర్పాటు చేసినట్లు స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే సంస్థను మరింత బలోపేతం చేసేందుకు, యాక్టివ్‌గా పనిచేస్తున్న ఎల్తూరి శంకర్‌ను రాష్ట్ర కార్యదర్శిగా నియమించినట్లు ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. కాగా, తన నియామకానికి సహకరించిన టీయూవీ రాష్ట్ర అధిష్ఠానానికి ఎల్తూరి శంకర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం కోసం, సంస్థ బలోపేతం కోసం శాయశక్తులా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

## ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి



**ప్రజానావావ, కొమురంభీమ్ ఆసిఫాబాద్ :** జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బక్రీద్ పండుగ సందర్భంగా ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ అహ్మద్ గారికి మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపిన గౌరవ ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు శ్రీమతి కోవ లక్ష్మి గారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బక్రీద్ పండుగ త్యాగం, సౌభ్రాతృత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ముస్లిం సోదర సోదరీమణులందరికీ హృదయపూర్వక బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్ గారు, ఆసిఫాబాద్ పార్టీ అధ్యక్షుడు జబోరే రవీందర్ గారు, సాయి శ్రవణ్ గారు, రెబ్బెన మాజీ జెడ్పీటీసీ బాపురావు గారు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఎరువులు అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవు

**పలు ఎరువుల దుకాణాల్లో తనిఖీ చేసి, నోటీసులు ఇచ్చిన : ఇంచార్జి అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.రూషేంద్రమణి**



**ప్రజానావావ, మిర్యాలగూడ :** రానున్న ఖరీఫ్ సీజన్ పై రైతులకు విత్తనాలు, ఎరువులను ఫర్టిలైజర్ నిర్వాహకులు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మిర్యాలగూడ ఇంచార్జి అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.రుషేంద్రమణి హెచ్చరించారు. మిర్యాలగూడ పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపణలు రావడంతో మిర్యాలగూడ ఇంచార్జి అసిస్టెంట్ డైరెక్టర్ ఎం. రూషేంద్రమణి గురువారం తనిఖీలు నిర్వహించి, నోటీసులు అందించారు. ఈ సందర్భంగా ఆమె పట్టణంలోని ఎంబి అక్కయ్య ఎరువుల దుకాణం, విశ్వామిత్ర ఆగ్రో కెమికల్స్, వెంకటరమణ ఏజెన్సీస్ దుకాణదారులు, నిర్వాహకులు మినిమం రిటైల్ ప్రైస్ (ఎంఆర్పి) ప్రభుత్వం నిర్ణయించిన ధరలకంటే అధిక ధరలకు డిఎపి, కాంప్లెక్స్ ఎరువులు అమ్ముతున్నారని వార్తలు రావడంతో, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ కుమార్ ఆదేశాలతో ఆయా దుకాణాల్లో రిజిస్టర్లు, బిల్లు బుక్కులు పరిశీలించామన్నారు. చట్ట ప్రకారం ఎరువులు విక్రాయించాలని, వ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించామన్నరు. వారి వెంట వ్యవసాయ శాఖ అధికారులు ఎరువుల దుకాణాల నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.



# చివరి గింజ వరకూ ధాన్యం కొనుగోలు చేస్తాం



- **బాల్క సుమన్‌పై మంత్రి వివేక్ ఆగ్రహం**

**చెన్నూరు మండలం బావురావుపేట ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కార్మిక మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి.**

- **బాల్క సుమన్ వ్యాఖ్యలను ఖండించిన కార్మిక మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి**

**ప్రజానావావ, మంచిర్యాల:** చివరి గింజ వరకు ధాన్యం కొనుగోళ్ళు చేస్తాం. ఈ సారి పంట దిగుబడి ఎక్కువ వచ్చింది. గత ఏడాది లక్ష పది వేల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు జరిపితే ఈ ఏడాది లక్ష 70 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించడం జరుగుతుంది. జూన్ 6 వరకు ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ కొనసాగుతుంది. పెద్దపల్లి లో మూడు గోడన్స్ అలాట్ మెంట్ చేయడం జరిగింది. హామలిల కొరత తో కొంచెం ఆలస్యం జరిగింది. సింగరేణి సంస్థ ను 40 లారీలు కావాలని అదే విధంగా మైనింగ్ శాఖ లో 45 లారీలను కేటాయించడం జరిగింది. మొత్తం 85 లారీలతో త్వరలోనే రైతుల నుండి చివరి గింజ వరకు కొని మిల్లులకు తరలిస్తాం. కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా జరుగుతుంటే బిఆర్ఎస్ నాయకులు రైతులను రెచ్చగొడుతున్నారు. పార్టీలకు అతీతంగా రైతులకు భరోసా కల్పించకుండా ఆందోళనలు చేసేలా రెచ్చగొడుతున్నారు. బాల్క సుమన్ ను ప్రజలు ఒడగొట్టారు ఆ ఫ్రస్ట్రేషన్ లో విధ్వంసం సృష్టించాలని చూస్తున్నారు. బీఆర్ఎస్ నాయకులు ఎక్కడ ధర్నాలు చేస్తున్న రైతులు రావట్లేదని బాల్క సుమన్ అన్నాడు లక్ష కోట్ల ప్రాజెక్టు అని కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి కమీషన్లు తీసుకున్నారు..కానీ రైతాంగానికి ఒక్క చుక్క నీరు అందలేదు. కాళేశ్వరం బ్యాక్ వాటర్ తో నష్టపోయిన రైతులకు నేను నష్ట పరిహారం అందించాను. గత బీ ఆర్ ఎస్ హయాంలో మిల్లుల ముందు వందల లారీలు నిలిచిపోయేవి ఇప్పుడు అలా ఏం లేదు.

### లిటీఆర్ పై మండిపడ్డ మంత్రి వివేక్

చట్టాన్ని చేతుల్లో తీసుకొని షో చేయాలని బాల్క సుమన్ చూస్తున్నాడు సింగరేణి భవన్ నీ కాల్చాలి, రైలు పట్టాలు కోయాలి అని చట్టాన్ని అతిక్రమించి మాట్లాడుతున్నారు బాల్క సుమన్ స్వతహాగా ఒప్పుకున్నాడు ధర్నాలకు రైతులు వస్తలేరు అని కావాలనే కార్యకర్తలను రెచ్చగొట్టి ఇక్కడ ఆందోళనలు చేయడానికి ప్రయత్నం చేస్తున్నాడు ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేస్తే సహించేది లేదు చట్టపరమైన చర్యలు తప్పవులి గత ఎన్నికల్లో 100 కేసులు 100 కోట్లు ఖర్చు చేశాడు.అన్ని డబ్బులు బాల్క సుమన్ కి ఎక్కడివి బాల్క సుమన్ చేసిన చట్ట వ్యతిరేఖ వ్యాఖ్యలకు కేటీఆర్ సమాధానం చెప్పాలి చట్టప్రకారం చేయాలి అని స్టేట్మెంట్ లు ఇచే కేటీఆర్ బాల్క సుమన్ వ్యాఖ్యలకు సమాధానం చెప్పాలి బాల్కా సుమన్ అరెస్ట్ అయితే జైలుకు వెళ్లి పరామర్శించిన కేటీఆర్...బాల్క సుమన్ చట్ట వ్యతిరేక వ్యాఖ్యలు చేస్తే ఎందుకు స్పందించడం లేదులి

### అంటే బాల్క సుమన్ వాక్యాలను కేటీఆర్ సమర్థిస్తున్నాడా?

ప్రజలందరూ గమనిస్తున్నారు.. రాజకీయాల్లో ఎప్పుడూ పలువురికి ఆదర్శంగా నిలవాలి తప్ప రెచ్చగొట్టి విధ్వంసాలకి గురిచేసి ప్రజలకు,నాయకుల ను తప్పు తోవ పట్టించొద్దులినేటిసాక్షి, తిరుమలాయపాలెం (రుద్రరాజు): సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం పనికి తగ్గ కనీస వేతనం అమలు చేయాలని మే 18 నుంచి వివోఏ లు చేస్తున్న సమ్మెలో భాగంగా మండల కేంద్రంలో వివోఏ లు రోజుకొక విన్నూత రీతిలో నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఆరవ రోజు దీక్షలో రోడ్డుపై వంట వార్పు చేసి వివోఏలు అంతా దీక్షా శిబిరంలోనే భోజనాలు చేసి తమ నిరసన వ్యక్తాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా వివోఏ ల జేఏసీ జిల్లా అధ్యక్షురాలు వేల్పుల సుశీల మాట్లాడుతూ వివోఏల బతుకులు రోడ్డుపై పడవేయకుండా వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి వివోఏలకు కనీస వేతనం అమలు అమలుచేసి తమను ఆదుకోవాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం నిత్యం స్వయం సహాయక సంఘాల సభ్యుల జీవితాల్లో వెలుగులు నింపే వివోఏ లకు మాత్రం కనీస వేతనం ఇవ్వకుండా వారితో వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని తమ ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివోఏల పట్ల సానుకూలంగా స్పందించి వివోఏ లకు 20 వేల రూపాయల వేతనం అమలు చేసి నేరుగా వారి వ్యక్తిగత గతాల్లో వేతనాన్ని జమ చేయాలని ఆమె కోరారు. 57 ఏళ్లు దాటిన వివోఏలకు పెన్షన్లు, ఇన్సూరెన్స్‌లు, బీమా సౌకర్యం, వివోఏ ల కుటుంబాలకు హెల్త్ కార్డులు ఉద్యోగ భద్రత హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని పని భారాన్ని తగ్గించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివోఏల జేఏసీ జిల్లా అధ్యక్షురాలు వేల్పుల సుశీల,గుగ్గిళ్ళ ఉమా, మండాది కళమ్మ, పోలూరి విజయలక్ష్మి బొడ్డు కుసుమ,మాధురి, మేకల కృష్ణవేణి, ధనలక్ష్మి, మెట్టు స్వరూప రాణి, గుంటెటి విజయ కుమారి, కవిత, కుమారి, రమణ, పద్మ సామినేని కరుణ, సుజాత, మంజుల, జయ, గోపోజి ఉపేంద్ర, విజయలక్ష్మి,సిహెచ్ జ్యోతి ధనలక్ష్మి, జయ, జర్పుల సరిత బోడ సునీత బోడ అనుష తదితరులు పాల్గొన్నారు.

# ఏకలవ్య ఉత్తమ విద్యార్థుల పురస్కారాల ప్రదానం



**ప్రజానావావ, నాగర్ కర్నూల్:** జిల్లా ఎరుకల ఉద్యోగుల సంఘం తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం సంయుక్తంగా గురువారం పట్టణంలోని ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఎరుకల విద్యార్థిని విద్యార్థులలో ప్రతిభావంతులను గుర్తించి ఏకలవ్య ఉత్తమ విద్యార్థుల పురస్కారాలను అందజేయడంతో పాటు ప్రతిభావంతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ మోటివేటర్ కుతాడి తిరుపతి తో పాటు దళిత బహుజన రాజ్యాధికార సమైక్య రాష్ట్ర కన్వీనర్ గుడిపల్లి రవి సభ అధ్యక్షులు ఉపాధ్యాయులు పడిగే శ్రీనివాసులు తదితరులు మాట్లాడుతూ పదవ తరగతి లో 12 మంది ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 8 మంది రెండవ సంవత్సరంలో 9 మంది డిగ్రీలో ముగ్గురు విద్యార్థులను గుర్తించి ప్రశంస పత్రాలను అందజేయడంతో పాటు శాలువాలతో సన్మానించి రివార్డులను అందజేసినట్టు తెలిపారు ఎరుకల విద్యార్థులు చైతన్యవంతం కావడానికి విద్యాపరంగా ఎలాంటి నైపుణ్యాలు అధికమించాలో తిరుపతయ్య సూచనలు సలహాలు ఇచ్చారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తిరుపతయ్య డిప్యూటీ తాసిల్దార్ నారాయణ మహబూబ్నగర్ ఎరుకల సంఘం నాయకులు వెంకట్ రాములు పర్వతాలు కృష్ణయ్య తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షులు మల్లేష్ వర్కింగ్ ప్రెసిడెంట్ కౌన్సిలర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



- **20 ఏళ్ల స్నేహబంధాన్ని గుర్తు చేసుకున్న ఓపెన్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థులు**
- **పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపిన మాజీ విద్యార్థులు**

**ప్రజానావావ, మెట్‌పల్లి:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, మెట్ పల్లి అధ్యయన కేంద్రంలో 2007 నుంచి 2010 వరకు డిగ్రీ పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం గురువారం మెట్ పల్లి పట్టణంలోని రేణుక ఎల్లమ్మ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. దాదాపు రెండు దశాబ్దాల అనంతరం ఒకేచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆనాటి కళాశాల రోజుల జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ భావోద్వేగాలకు లోనయ్యారు.

### స్నేహబంధాలకు మరోసారి నూతన ఊపిరి

విద్యార్థి దశలో ఏర్పడిన స్నేహబంధాలను మరోసారి పునరుద్ధరించుకునేందుకు ఈ సమ్మేళనం వేదికైంది. ఉద్యోగాలు, కుటుంబ బాధ్యతలు, జీవన ప్రయాణంలో వేర్వేరు ప్రాంతాలకు వెళ్లిపోయిన స్నేహితులు తిరిగి ఒకచోట కలవడంతో కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో సాగింది. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ పాత రోజుల అనుభవాలను గుర్తు చేసుకున్నారు.

### కండువాలు, మెమెంటోలతో సన్మానం

ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పరస్పరం కండువాలు కప్పి, మెమెంటోలు అందజేసుకొని సన్మానించుకున్నారు. కళాశాల రోజుల్లో జరిగిన సరదా సంఘటనలు, పరీక్షల సమయాల్లో ఎదురైన అనుభవాలు, అధ్యాపకులతో ఉన్న అనుబంధాలను గుర్తు చేసుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. కొంతమంది తమ విద్యార్థి దశ జీవితాన్నే జీవితంలో మరిచిపోలేని మధుర ఘట్టంగా అభివర్ణించారు.

### ఆనందోత్సాహాలతో సాగిన కార్యక్రమం

సమ్మేళనం మొత్తం ఉత్సాహభరితంగా సాగింది. పూర్వ విద్యార్థులు కుటుంబ సభ్యులతో కలిసి హాజరై స్నేహబంధాలను మరింత బలోపేతం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గోపి యాదవ్‌తో పాటు కోరుట్ల నియోజకవర్గ ప్రాంతానికి చెందిన పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సమ్మేళనాలను తరచుగా నిర్వహించాలని పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు.

బిజినెస్

## సగానికి తగ్గిన వెంచర్ ఇన్వెస్ట్‌మెంట్స్




వెంచర్ క్యాపిటల్, ప్రయివేట్ ఈక్విటీ(పీఈ) ఫండ్స్ పెట్టుబడులు గత నెలలో సగానికి క్షీణించాయి. వెరసి ఏప్రిల్‌లో 38 డీల్స్ ద్వారా 2.7 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ప్రధానంగా డాలరుతో మారకంలో రూపాయి క్షీణత, రాజకీయ భౌగోళిక ఆందోళనలు దెబ్బతీశాయి. ఐవీసీఏ, కన్సల్టెన్సీ సంస్థ ఈవై విడుదల చేసిన నివేదిక ప్రకారం 2025 ఏప్రిల్‌తో పోలిస్తే విలువలో 50 శాతం తగ్గాయి. 2026 ఏప్రిల్‌లో 83 లావాదేవీలు నమోదయ్యాయి. ఇవి 29 నెలల కనిష్టంకాగా.. గతేడాది ఏప్రిల్‌లో 134, ఈ ఏడాది మార్చిలో 131 ట్రాన్సాక్షన్స్ జరిగాయి. డాలరుతో మారకంలో రూపాయి 96 స్థాయికి పడిపోవడం, అధికస్థాయిలలో కొనసాగుతున్న ముడిచమురు ధరలు, రాజకీయ భౌగోళిక ఆందోళనలు పెట్టుబడులను ప్రభావితం చేసినట్లు ఈవై పార్ట్‌నర్ వివేక్ సోనీ పేర్కొన్నారు. ఐసీఐసీఐ ప్రుడెన్సియల్ ఆల్టర్నేటివ్స్ 28.3 కోట్ల డాలర్ల పెట్టుబడులు గత నెలలో నమోదైన అతిపెద్ద డీల్‌గా నివేదిక తెలియజేసింది. బెంగళూరు, పుణేలలో ఆర్ఎంజెడ్ కార్యాలయ ఆస్తులలో ఇన్వెస్ట్ చేసినట్లు వెల్లడించింది.

## అందుబాటులోకి ఐటీఆర్--2

**న్యూఢిల్లీ:** ఆదాయపన్ను శాఖ 2026-27 అసెస్‌మెంట్ సంవత్సరానికి (2025--26 ఆర్థిక సంవత్సరం) ఐటీఆర్--2 (రిటర్నుల పత్రం)ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో ఈ ఫైలింగ్ పోర్టల్‌పై రిటర్నుల దాఖలు సాధ్యపడుతుంది. వ్యాపారం లేదా వృత్తి నుంచి ఎలాంటి ఆదాయం లేని వ్యక్తులు, హిందూ అవిభక్త కుటుంబాలు (హెచ్‌యూఎఫ్‌లు), మూలధన లాభాలు ఆర్జించి ఉంటే ఐటీఆర్--2ను దాఖలు చేయాల్సి ఉంటుంది. ఈ నెల 15న ఐటీఆర్--1, ఐటీఆర్--4 పత్రాలను సైతం ఆదాయపన్ను శాఖ అందుబాటులోకి తేవడం గమనార్హం. వ్యక్తిగత ఆదాయపన్ను చెల్లింపుదారులు ఐటీఆర్--1, 2 దాఖలుకు జూలై 31 తుది గడువుగా ఉంది. అదనంగా, ఈసారి ఐటీఆర్--2 ఫారంలో పన్ను చెల్లింపుదారుల కోసం కొన్ని కీలక మార్పులు చేసినట్లు ఆదాయపన్ను శాఖ వెల్లడించింది. ముఖ్యంగా విదేశీ ఆస్తులు, క్రిప్టో కరెన్సీ లావాదేవీలు, అధిక విలువ గల పెట్టుబడుల వివరాలను మరింత స్పష్టంగా వెల్లడించాల్సి ఉంటుంది. అలాగే ముందుగా నింపిన సమాచారం (ప్రీ--ఫిల్డ్) సౌకర్యాన్ని కల్పించడం వల్ల బ్యాంక్ వడ్డీలు, డివిడెండ్‌లు, టీడీఎస్ వివరాలు ఆటోమేటిక్‌గా కనిపించే అవకాశం ఉంది. దీంతో రిటర్నుల దాఖలు ప్రక్రియ మరింత సులభతరం అవుతుందని అధికారులు పేర్కొన్నారు.




# ముకేశ్ అంబానీ వేతనం సున్నా..

## వరుసగా ఆరోసారి జీతం అందుకోని రిలయన్స్ చైర్మన్

**న్యూఢిల్లీ :** దేశీయ కుబేరుడు ముకేశ్ అంబానీ వరుసగా ఆరోసారి ఎలాంటి వేతనం అందుకోలేదు. 2008-09 నుంచి 2019-20 వరకు ప్రతియేటా రూ.15 కోట్ల వార్షిక రెమ్యునేషన్ అందుకున్న ముకేశ్.. 2020-21 నుంచి 2025-26 వరకు ఎలాంటి వేతనం తీసుకోలేదని సంస్థ వెల్లడించింది. ప్రస్తుతం ఆయన డివిడెండ్ మాత్రమే తీసుకుంటున్నారు. కరోనా సమయంలో తన వేతనాన్ని పూర్తిగా విరాళం ఇచ్చిన ఆయన ఆ సమయంలో భవిష్యత్తులో జీతం తీసుకోకూడదని నిర్ణయించుకున్నారు. ఇక అప్పటి నుంచి(2020-21 నుంచి 2025-26 వరకు) ఇప్పటి వరకు ఎలాంటి వేతనం పొందలేని కంపెనీ వర్గాలు వెల్లడించాయి.



గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను కంపెనీ విడుదల చేసిన వార్షిక నివేదికలో ముకేశ్ అంబానీ ఎలాంటి వేతనం తీసుకోలేదని, అలవెన్స్‌లు, రిటైర్‌మెంట్ ప్రయోజనాలు మాత్రం పొందారు. గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను సంస్థ కన్సాలిడేటెడ్ నికర లాభం 95,754 కోట్ల లాభాన్ని ఆర్జించగా, మార్కెట్ క్యాపిటలైజేషన్ విలువ రూ.18,19,103 కోట్లకు చేరుకున్నది. కంపెనీలో 1.61 కోట్ల షేరు కలిగివున్న ముకేశ్ అంబానీ గతేడాదికిగాను రూ.9.66 కోట్ల డివిడెండ్ చెల్లింపులు జరిపారు. సంస్థలో ప్రమోటర్లు 664.5 కోట్ల షేర్లు లేదా 50.07 శాతం వాటా ఉండటంతో రూ.3,987 కోట్ల డివిడెండ్ చెల్లింపులు జరిపింది.

అలాగే అంబానీ బ్రదర్స్ నిఖిల్, హితాల్ మెస్వానీలు రూ.25 కోట్ల వార్షిక వేతనాన్ని అందుకున్నారు. వీటిలో రూ.10 కోట్లు..వేతనం, అలవెన్స్ వంటి రూపంలో ఆయన పొందారు. 2023లో కంపెనీ బోర్డులోకి చేరిన ఆయన పిల్లలు ఇషా, ఆకాశ్, అనంత్‌లు గత ఆరేండ్ల నుంచి ఎలాంటి వేతనం పొందలేదని పేర్కొంది. వీరు కేవలం వేతనం కింద రూ.12.17 కోట్లు(రూ.2.29 కోట్లు కమిషన్ కలుపుకొని) గతేడాదికిగాను పొందారు. కంపెనీ నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు రామిందర్ సింగ్ గుజ్రాల్, శుమీత్ బెనర్జీ, ఎస్బీఐ మాజీ చైర్‌పర్సన్ అరుంధతీ భట్టాచార్య, మాజీ సీవీసీ కేవీ చౌదరి, బ్యాంకింగ్ వెటరన్ కేవీ కామ్‌లు కమిషన్ కింద రూ.2.5 కోట్లు పొందారు. అంతక్రితం ఏడాది అందుకున్న రూ.2.25 కోట్లతో పోలిస్తే భారీగా పెరిగింది.

**రిటైల్ రంగం అంతంతే: రిలయన్స్**

దేశీయ సంఘటిత రిటైల్ రంగం స్వల్పకాలికంగా ఒత్తిడికి గురికాకతప్పదని రిలయన్స్ రిటైల్ వెల్లడించింది. అంతర్జాతీయంగా ప్రస్తుతం నెలకొన్న స్థూల ఆర్థిక పరిస్థితులు నిరాశాజనకంగా ఉండటం ఇందుకు కారణమని, కానీ, భవిష్యత్తులో ఈ రంగం రెండంకెల వృద్ధిని నమోదు చేసుకునే అవకాశాలున్నాయని పేర్కొంది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రిలయన్స్ రిటైల్ రూ.3 లక్షల కోట్ల విక్రయాలు జరిపింది.

# రూపాయిని ఇంకా నష్టపోనివ్వాలి.. మరికొంత కాలం ఆర్బీఐ జోక్యం చేసుకోవద్దు

**ముంబై, మే 28:** కరెన్సీ మార్కెట్‌లో రూపాయి పతనాన్ని స్వేచ్ఛగా కొనసాగనివ్వాలని, మరికొంత కాలం ఈ విషయంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) జోక్యం చేసుకోవద్దని ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు అన్నారు. అప్పుడే అంతర్జాతీయంగా ఎదురవుతున్న ఒత్తిళ్లను భారతీయ కరెన్సీ తట్టుకోగలదని వ్యాఖ్యానించారు. అలాగే ద్రవ్యోల్బణం విజృంభిస్తే.. దాన్ని కట్టడి చేసేందుకు వడ్డీరేట్ల పెంపునకు బదులు ఇతర ద్రవ్యపరమైన సాధనాలను వినియోగించాలని పీటీఐకిచ్చిన ఇంటర్వ్యూలో ఆర్బీఐకి దువ్వూరి సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి (2026-27)గాను రెండో ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షను వచ్చే వారం ఆర్బీఐ చేపట్టనున్న క్రమంలో దువ్వూరి వ్యాఖ్యలు ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి. రూపాయి విలువ పతనాన్ని అడ్డుకోవడంలో ద్రవ్య విధానం పాత్ర ఎప్పుడూ చివర్లోనే అని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. అయితే వడ్డీరేట్ల పెంపుతోనే ద్రవ్యోల్బణం ఆందోళనల్ని తగ్గించవచ్చని విశ్వసిస్తే ఆర్బీఐ ద్రవ్య విధానాన్ని కఠినతరం చేయవచ్చునని కూడా అన్నారు.

**తగ్గిస్తే అది.. పెంచితే ఇది..**

'కీలక వడ్డీరేట్లను తగ్గిస్తే దేశ ఆర్థిక వృద్ధికి మద్దతిచ్చినట్టవుతుంది. కానీ ద్రవ్యోల్బణం విజృంభించే ప్రమాదం ఉన్నది. పరిస్థితులు డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ పతనానికీ దారితీయగలవు. అలాగే వడ్డీరేట్లను పెంచితే జీడీపీకి దెబ్బ. కాబట్టి ఈ విషయంలో బ్యాలెన్సింగ్.. ఆర్బీఐ ద్రవ్య విధాన కమిటీకి ఎప్పుడూ కత్తి మీద సామే' అని దువ్వూరి అభిప్రాయపడ్డారు. జూన్ 3-5 తేదీల్లో ఆర్బీఐ ద్రవ్య సమీక్ష జరుగనున్న విషయం తెలిసిందే. పశ్చిమాసియా సంక్షోభంతో అంతర్జాతీయ మార్కెట్‌లో పరుగులు పెడుతున్న ముడి చమురు ధరలు.. దేశీయ మార్కెట్‌లో ఇంధన ధరల్ని ఎగదోస్తున్నాయి. ఇప్పటికే లీటర్ పెట్రోల్, డీజిల్ రేట్లు దాదాపు రూ.8 చొప్పున ఎగిశాయి. సీఎన్జీ, వంటగ్యాస్ ధరలూ ఎగబాకాయి. ఈ నేపథ్యంలో రాబోయే ఆర్బీఐ ద్రవ్య సమీక్ష నిర్ణయాలు అత్యంత కీలకమని ఆర్థిక నిపుణులు అంటున్నారు. ప్రస్తుతం రెపో రేటు 5.25 శాతం వద్ద ఉన్నది. ఏడాది కిందట 6.50 శాతంగా ఉంటే.. 1.25 శాతం మేర ఆర్బీఐ తగ్గించింది.

**నిజంగా సవాలే..**

ప్రతికూల పరిస్థితుల్లో రూపాయి మారకం విలువను స్థిరీకరించడం నిజంగా ఓ సవాలేనని దువ్వూరి అన్నారు. కాగా, ఈ నెల 20న డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ తొలిసారి 97 మార్కు దరిదాపుల్లోకి వెళ్లింది. దీంతో ఆర్బీఐ జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. అప్పట్నుంచి కొద్దికొద్దిగా కోలుకోవడం మొదలుపెట్టింది. 'మారకం రేటు సంక్షోభాలు చివరకు నమ్మకాన్నే దెబ్బతీస్తాయి. ఒకవేళ మదుపర్లు, దిగుమతిదారులు, ప్రజలు రూపాయి విలువ మరింత పడిపోతుందనే విశ్వసిస్తే.. ఇంకా అప్రమత్తమవుతారు. ఈ పరిణామం రూపాయిని తీవ్ర ఒత్తిడికి గురిచేస్తుంది. అప్పుడు లాభాల కోసం ఎగుమతిదారులు తమ డాలర్లను వెనుకకు తీసుకురావడాన్ని ఆలస్యం చేస్తారు. ఫలితంగా దిగుమతిదారులు డాలర్ల కొనుగోలుకు ఎగబడుతారు. ప్రజలు బంగారంపై దృష్టి పెడితే.. మదుపర్లు నష్టాలను తగ్గించుకోవడానికి ప్రయత్నిస్తారు' అని దువ్వూరి విశ్లేషించారు. ఈ సమయంలోనే ఆర్బీఐ, ఇతరత్రా విధానకర్తలు భయపడకుండా, రక్షణాత్మకంగా కాకుండా సమర్థవంతమైన నిర్ణయాలను తీసుకోవాల్సి ఉంటుందన్నారు.

స్పోర్ట్స్

# మరొక్క అడుగు.. ఫైనల్‌కు చేరేదెవరు?

**సాయి సుదర్శన్ - శుభ్‌మన్ గిల్.. నిలకడగా ఆడుతూ ఒక్కొక్క గేర్ మార్చుకుంటూ ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లే జోడీ..**

**వైభవ్ సూర్యవంశీ- యశస్వి జైస్వాల్.. విధ్వంసకరమైన బ్యాటర్లు. వచ్చీరాగానే సిక్స్ కొడదామా లేకపోతే ఫోర్‌తో ఇన్నింగ్స్‌ను ఆరంభిద్దామా అనే బ్యాటర్లు..**




రెండో క్వాలిఫయర్ మ్యాచ్‌లో ఆసక్తికర పోరు వీరిద్దరి మధ్యే అనడంలో సందేహం లేదు. శుక్రవారం జరగనున్న ఈ మ్యాచ్‌లో విజేతగా నిలిచే జట్టు ఫైనల్‌కు చేరుకొని.. కప్పు కోసం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో తలపడనుంది.

**ఓడినా.. ముందుకొచ్చి**

ఐపీఎల్ 2026 సీజన్ పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో నిలిచిన గుజరాత్ టైటాన్స్ తొలి క్వాలిఫయర్‌లో ఘోరంగా ఓడింది. ఆర్సీబీ బ్యాటర్ల ముందు బౌలింగ్ తేలిపోవడంతో ఏకంగా 254 పరుగులు సమర్పించుకుంది. లక్ష్య ఛేదనలో 162 పరుగులకే కుప్పకూలింది. టాప్ -3 బ్యాటర్లు విఫలమైతే పరిస్థితి ఎలా ఉంటుందో జీటీకి బాగా తెలిసొచ్చింది. ఐపీఎల్ ఆరెంజ్ క్యాప్ రేసులోని సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్ నుంచి మంచి ఆరంభం వస్తేనే గుజరాత్ విజయావకాశాలు మెరుగ్గా ఉంటాయి. మరోవైపు, మిడిలార్డర్‌లో నిలకడగా ఆడే ప్లేయర్ లేకపోవడం జీటీ బలహీనత. బౌలింగ్ విషయంలో గుజరాత్‌కు పెద్దగా ఇబ్బందులేమీ లేవు. గత మ్యాచ్ మినహా మిగతా వాటిల్లో మెరుగైన ప్రదర్శన చేశారు. కగిసో రబాడ (26), రషీద్ ఖాన్ (19), సిరాజ్ (17) ఒక్కసారి లయను అందుకొంటే ప్రత్యర్థి బ్యాటర్లకు కష్టాలు తప్పవు. సాయి కిశోర్, వాషింగ్టన్ సుందర్ స్పిన్ ఆల్‌రౌండర్లతోపాటు జేసన్ హోల్డర్ వంటి పేస్ ఆల్‌రౌండర్ మంచి ఫామ్‌లో ఉన్నారు.

**అలా వచ్చి.. అద్భుత విజయంతో**

రాజస్థాన్ ప్రయాణం చాలా క్లిష్టమైంది. నాకౌట్ స్టేజ్‌కు చేరుకోవడానికే చాలా ఇబ్బందులు పడింది. వైభవ్ సూర్యవంశీ, రియాన్ పరాగ్, ధ్రువ్ జురెల్ నుంచి నిలకడగా పరుగులు వస్తున్నాయి. మరోవైపు, యశస్వి, ఫెర్రీరా అప్పుడప్పుడు మినహా.. తమదైన శైలిలో ఈసారి సీజన్‌లో ప్రభావం చూపించలేదు. ఎలిమినేటర్‌లో సన్‌రైజర్స్‌పై టాప్ ఆర్డర్ అదరగొట్టినా.. మిడిలార్డర్ ఇబ్బంది పడటంతో అనుకున్నంత మేర స్కోరును సాధించలేదని ఆ జట్టు సారథే చెప్పాడు. రాజస్థాన్ బౌలింగ్ యూనిట్‌ను జోఫ్రా ఆర్చర్ ముందుండి నడిపించాడు. ఎస్ఆర్‌హెచ్‌పై కీలక బ్యాటర్లను పెవిలియన్‌కు పంపించి దెబ్బ కొట్టాడు. అతడికి తోడుగా నాంద్రీ బర్గర్ చెలరేగడం ఆర్ఆర్‌కు కలిసొచ్చింది. రవీంద్ర జడేజా సైలెంట్‌గా వికెట్లు తీస్తూ జట్టు విజయంలో కీలక పాత్ర పోషిస్తున్నాడు. మరో స్పిన్నర్ యశ్ రాజ్ పుంజా కూడా మెరుగైన ప్రదర్శన చేస్తున్నాడు.

**ముఖాముఖి..**

ఇప్పటి వరకు ఐపీఎల్‌లో గుజరాత్ - రాజస్థాన్ జట్లు 10సార్లు తలపడ్డాయి. శుభ్‌మన్ గిల్ నాయకత్వంలోని గుజరాత్ ఏడు మ్యాచుల్లో గెలిచింది. మరో మూడింట్లోనే రాజస్థాన్ విజయం సాధించింది.

## వేలంలోకి వైభవ్ సూర్యవంశీ.. రూ.30 కోట్లు చెల్లిస్తానన్న సెహ్వాగ్





సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో రాజస్థాన్ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ 29 బంతుల్లోనే 5 ఫోర్లు, 12 సిక్స్‌లు బాది 97 పరుగులు చేశాడు. ఈ సంచలన ఇన్నింగ్స్‌తో ఐపీఎల్‌లో ఒక సీజన్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన ఆటగాడిగా క్రిస్ గేల్ (59) పేరిట ఉన్న రికార్డును వైభవ్ (65) బ్రేక్ చేశాడు. ఈ నేపథ్యంలో మాజీ ఆటగాళ్లు వైభవ్‌పై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఎలిమినేటర్ మ్యాచ్ సందర్భంగా వీరేంద్ర సెహ్వాగ్, హర్భజన్ సింగ్ కామెంటెటరీ చేశారు. వీరి మధ్య వైభవ్ టాపిక్ వచ్చింది. ఒకవేళ సూర్యవంశీ వేలంలోకి వస్తే ఎంత డబ్బు చెల్లిస్తారని సెహ్వాగ్‌ని హర్భజన్ అడిగాడు. సెహ్వాగ్ ఏ మాత్రం ఆలోచించకుండా తాను రూ.30 కోట్లు చెల్లిస్తానని చెప్పాడు. నచ్చనివాళ్లు.. నీకు 15 ఏళ్లు కాదంటారు: వైభవ్‌కు రస్సెల్ కీలక సూచన వైభవ్‌లో స్పెషల్ టాలెంట్ ఉంది: అరుణ్ ధుమాల్ ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ కూడా వైభవ్‌పై ప్రశంసలు కురిపించారు. అతనిలో 'స్పెషల్ టాలెంట్' ఉందని.. ఈ కుర్రాడు మరింత రాటుదేలడానికి బీసీసీఐ, రాజస్థాన్ రాయల్స్ మార్గదర్శకత్వం అందిస్తాయని పేర్కొన్నారు. "వైభవ్ టెంపర్‌మెంట్ ఇలానే కొనసాగేందుకు అవసరమైన మార్గదర్శకత్వాన్ని బీసీసీఐ, రాజస్థాన్ ఫ్రాంఛైజీ అందిస్తాయి. క్రీడల్లో కేవలం శారీరకంగానే కాదు మానసికంగానూ దృఢత్వం అవసరం. అతను రాబోయే మరెన్నో సంవత్సరాలపాటు టీమ్‌ఇండియా తరపున రాణించేలా చూడటంలో మా వంతు కృషిని మేం తప్పకకుండా చేస్తాం" అని అరుణ్ ధుమాల్ తెలిపారు.

# జూన్‌లో టాలీవుడ్ జాతర..

## ‘పెద్ది’ నుంచి ‘స్వయంభూ’ వరకు భారీ రిలీజ్‌లు రెడీ!

2026 జూన్ నెల టాలీవుడ్ బాక్సాఫీస్‌కు భారీ వినోదాన్ని అందించేందుకు సిద్ధమవుతోంది. విభిన్న జోనర్లలో తెరకెక్కిన సినిమాలు వరుసగా థియేటర్లలోకి రానుండటంతో సినీ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా స్టార్ హీరోల చిత్రాలు, హారర్ కామెడీలు, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్లు, స్పోర్ట్స్ డ్రామాలు ఇలా అన్ని రకాల సినిమాలు ఈ నెలలో ప్రేక్షకులను అలరించబోతున్నాయి. జూన్ మొదటి వారంలోనే టాలీవుడ్ బాక్సాఫీస్‌కు భారీ ఊపు రానుంది. జూన్ 3న ‘అసురాసుర’ సినిమా విడుదల కానుంది. యాక్షన్, థ్రిల్లర్ ఎలిమెంట్స్‌తో తెరకెక్కిన ఈ మూవీపై ప్రేక్షకుల్లో ఆసక్తి కనిపిస్తోంది. ఇక జూన్ 4న మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన భారీ పాన్ ఇండియా చిత్రం ‘పెద్ది’ థియేటర్లలోకి రానుంది. ఇప్పటికే ఈ సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరుకున్నాయి. ట్రైలర్, టీజర్లు సోషల్ మీడియాలో భారీ హైప్ క్రియేట్ చేశాయి. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో యాక్షన్, ఎమోషన్, స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ ప్రధాన ఆకర్షణలుగా ఉండనున్నాయి. అదే వారంలో జూన్ 5న ‘రావ్ బహదూర్’ విడుదల కానుంది. అలాగే హాలీవుడ్ ఫాంటసీ యాక్షన్ చిత్రం ‘మాస్టర్స్ ఆఫ్ ది యూనివర్స్’ కూడా అదే రోజున ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో మొదటి వారంలోనే బాక్సాఫీస్ వద్ద మంచి పోటీ కనిపించనుంది. జూన్ రెండో వారం మాత్రం కాస్త నెమ్మదిగా ఉండనుంది. జూన్ 11న ‘సంగీతం’ అనే సినిమా మాత్రమే విడుదల కానుంది. సంగీతం ప్రధానంగా తెరకెక్కిన ఈ చిత్రంపై సంగీత ప్రియుల్లో ఆసక్తి నెలకొంది. అయితే అసలు పోటీ మాత్రం జూన్ మూడో వారంలో కనిపించనుంది. జూన్ 19న ఒకేసారి నాలుగు సినిమాలు థియేటర్లలోకి రాబోతున్నాయి. ‘బాలన్ ది బాయ్’, ‘ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు’, హారర్ కామెడీ మూవీ ‘చెట్టు మీద దెయ్యం నాకేం భయం’, అలాగే ఫ్యామిలీ ఎమోషన్స్‌తో తెరకెక్కిన ‘మా ఇంటి బంగారం’ సినిమాలు ఒకేరోజు విడుదల కానున్నాయి. ఈ నాలుగు చిత్రాలు పూర్తిగా భిన్నమైన జోనర్లలో ఉండటంతో ప్రేక్షకులకు మంచి ఎంటర్‌టైన్‌మెంట్ ప్యాకేజ్ లభించే అవకాశం ఉంది. ముఖ్యంగా హారర్ కామెడీ సినిమాలకు ఇటీవల మంచి ఆదరణ లభిస్తున్న నేపథ్యంలో ‘చెట్టు మీద దెయ్యం నాకేం భయం’పై ప్రత్యేక ఆసక్తి కనిపిస్తోంది. జూన్ చివరి వారం మాత్రం బాక్సాఫీస్ వద్ద భారీ హంగామా ఉండనుంది. జూన్ 26న పీరియాడిక్ యాక్షన్ డ్రామా ‘స్వయంభూ’ విడుదల కానుంది. ఈ సినిమాపై ఇప్పటికే సినీ వర్గాల్లో మంచి బజ్ నెలకొంది. అదే రోజున స్పోర్ట్స్ డ్రామా ‘సూపర్ గోల్’ కూడా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక రాజకీయ నేపథ్యంతో తెరకెక్కిన ఇంటెన్స్ డ్రామా ‘లెనిన్’ కూడా జూన్ 26నే విడుదల కానుండటం విశేషం. దీంతో నెలాఖరులో మూడు ప్రధాన చిత్రాలు ఒకేసారి బాక్సాఫీస్ బరిలోకి దిగనున్నాయి. మొత్తం మీద చూస్తే 2026 జూన్ నెల టాలీవుడ్ ప్రేక్షకులకు ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇవ్వబోతోందనే చెప్పాలి. భారీ పాన్ ఇండియా సినిమాల నుంచి చిన్న కాన్సెప్ట్ మూవీస్ వరకు అన్ని రకాల చిత్రాలు ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నాయి. ఇక వీటిలో ఏ సినిమా బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తుందో చూడాలి.






## వాట్ ఏ ప్లాన్ గురూ..

### వారణాసి వైల్డ్ యాక్షన్ ఎపిసోడ్ ఆన్ ది వే.. !

మహేశ్ బాబు కాంపౌండ్ నుంచి రాబోతున్న మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్ట్ వారణాసి స్టార్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో బాలీవుడ్ భామ ప్రియాంకా చోప్రా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. మాలీవుడ్ స్టార్ యాక్టర్ పృథ్వీరాజ్ సుకుమార్ కీ రోల్‌లో నటిస్తున్నాడు. మాధవన్, ప్రకాశ్ రాజ్ కీలకపాత్రల్లో నటిస్తున్నారు. మైథాలజీ, సైన్స్ ఫిక్షన్ జోనర్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తోన్న ఈ మూవీకి సంబంధించి ఏదో ఒక వార్త నెట్టింట వైరల్ అవుతూ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తుంది. షూటింగ్ దశలో ఉన్న వారణాసి కొత్త షెడ్యూల్ వార్త ఒకటి నెట్టింట హైప్ క్రియేట్ చేస్తోంది. జక్కన్న టీం నెక్ట్స్ సినిమాలో వచ్చే ఓ భారీ వైల్డ్ యాక్షన్ ఎపిసోడ్‌ను ప్లాన్ చేస్తుందట. ఒళ్లు గగుర్పొడిచే స్టంట్స్, భారీ సెట్స్, ఇంటెన్స్ యాక్షన్ కొరియోగ్రఫీ లాంటి కీ ఎలిమెంట్స్‌తో ఈ షెడ్యూల్ కొనసాగనుందట. తాజా టాక్ ప్రకారం నాన్ స్టాప్ నెల పాటు రాజమౌళి టీం ప్లాన్ చేసినట్టు ఇన్‌సైడ్ టాక్. సినిమాలో ఇదే బిగ్గెస్ట్ యాక్షన్ సీక్వెన్స్ అని.. భారతీయ సినిమా చరిత్రలో ఇప్పటిదాకా ఎవరూ ప్రయత్నించని విధంగా ఈ సీక్వెన్స్ ఉండబోతుందన్న వార్త ఇప్పుడు మూవీ లవర్స్‌తోపాటు మహేశ్ బాబు అభిమానులను ఫుల్ ఖుషీ చేస్తోంది. ఇదే నిజమైతే జక్కన్న మరోసారి తన రికార్డులను తానే బీట్ చేయడం పక్కా అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ చిత్రాన్ని శ్రీ దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీకి ఎంఎం కీరవాణి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రం రెండు పార్టులుగా రాబోతుంది. ఈ మూవీ ఫస్ట్ పార్ట్‌ను 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయన్నట్టు ఇప్పటికే ప్రకటించింది టీం. సెకండ్ పార్ట్ 2029లో వస్తుందని వార్తలు రాగా.. రాజమౌళి టీం రాబోయే రోజుల్లో ఏదైనా క్లారిటీ ఇస్తుందేమో చూడాలి.



## సూర్య ‘విశ్వనాథ్ అండ్ సన్స్’ విడుదల తేదీ ఖరారు!

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, టాలీవుడ్ డైరెక్టర్ వెంకీ అట్లూరి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ మూవీ ‘విశ్వనాథ్ అండ్ సన్స్’ విడుదల తేదీ తాజాగా ఖరారైంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవ లాంగ్ వీకెండ్‌ను టార్గెట్ చేస్తూ ఈ డేట్‌ను లాక్ చేసినట్లు తెలుస్తుంది. ‘సార్’, ‘లక్కీ భాస్కర్’ వంటి వరుస హిట్లతో జోరుమీదున్న వెంకీ అట్లూరి, ఈసారి సూర్యతో కలిసి ఒక విలక్షణమైన ఫ్యామిలీ ఎమోషనల్ డ్రామాను ప్రేక్షకు ముందుకు తీసుకురాబోతున్నారు. ఈ సినిమాలో సూర్య 40 ఏళ్ల అంతర్జాతీయ పిస్టల్ షూటర్ ‘సంజయ్ విశ్వనాథ్’ పాత్రలో సరికొత్త లుక్‌లో కనిపించబోతుండగా.. సూర్య సరసన యంగ్ బ్యూటీ మమితా బైజు కథానాయికగా నటిస్తుంది. సీనియర్ నటీమణులు రాధికా శరత్‌కుమార్, రవీనా టాండన్, మరియు భవాని శ్రీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా, నిమిష్ రవి సినిమాటోగ్రఫీని, నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

## భారతీయ ఇండీ సినిమాకు కేరాఫ్ అడ్రస్‌గా రానా

తెలుగు హీరో రానా దగ్గుబాటికి చెందిన ‘స్పిరిట్ మీడియా’ మన దేశంలో ఇండీ సినిమాలకు సరికొత్త ప్లాట్‌ఫామ్‌గా మారుతూ కొత్త ట్రెండ్ సెట్ చేస్తుంది. ఇండియాలోని అన్ని భాషలకు చెందిన చిన్న చిత్రాలను, క్రియేటివ్ కథలను సపోర్ట్ చేస్తూ వాటిని థియేటర్ల వరకు తీసుకురావడానికి స్పిరిట్ మీడియా గట్టిగా ప్రయత్నిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఫిల్మ్ ఫెస్టివల్స్ లో మంచి గుర్తింపు తెచ్చుకున్న సినిమాలను, మన నేటివిటీకి దగ్గరగా ఉండే నిజాయితీ గల కథలను ప్రేక్షకుల వద్దకు తీసుకెళ్లడమే స్పిరిట్ మీడియా మెయిన్ టార్గెట్. దీనివల్ల పెద్దగా గుర్తింపు లేని ఎంతోమంది ప్రతిభావంతులైన దర్శకులు, రచయితలకు తమ కథలను దేశవ్యాప్తంగా చూపించే ఒక అద్భుతమైన ఛాన్స్ దొరుకుతోంది. ఈ ఇండీ ఫిలిం మూవ్‌మెంట్‌లో ప్రస్తుతం నార్త్ ఈస్ట్ సినిమాలు చాలా స్పెషల్‌గా నిలుస్తూ వేగంగా ఎదుగుతున్నాయి. సిక్కిం, అసోం, మణిపూర్ లాంటి ప్రాంతాల నుండి వస్తున్న సినిమాలు ప్రేక్షకులకు ఒక సరికొత్త సినిమాటిక్ అనుభూతి ఇస్తున్నాయి. అక్కడి విభిన్నమైన కల్చర్‌ని, అచ్చమైన భావోద్వేగాలని చాలా రియలిస్టిక్‌గా చూపిస్తూ ప్రపంచవ్యాప్తంగా అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఇందుకు బెస్ట్ ఎగ్జాంపుల్ గా ఈ శుక్రవారం థియేటర్లలోకి వస్తున్న సిక్కిం మూవీ ‘షేప్ ఆఫ్ మోమో’ని చెప్పుకోవచ్చు. త్రిబేనీ రాయ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఇప్పటికే 15కి పైగా అంతర్జాతీయ అవార్డ్స్ గెలుచుకుంది. జోయా అక్తర్, పాయల్ కపాడియా లాంటి క్రేజీ మేకర్స్ ఈ ప్రాజెక్ట్‌కి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్ గా సపోర్ట్ ఇవ్వడం విశేషం. ఇలాంటి అద్భుతమైన సినిమాలను థియేటర్లకు తీసుకురావడం ద్వారా స్పిరిట్ మీడియా అన్ని ప్రాంతాల సినిమాలకు సమానమైన ఇంపార్టెన్స్ ఇస్తూ ఒక మంచి సినిమా కల్చర్ ని బిల్డ్ చేస్తోంది.



Printed, Published and Owned by **Adula Thirupathi,** and Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, and Published from 2-5-23, Mudhiraj street,Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi. RNI NO : TELTEL/2023/87657** Email: prajanaava@gmail.com. Phone No: **99484 33277.**